గౌరవనీయులకు...
RAMRAJ
కాటన్
భారతీయ సంస్కృతి

సంపుటి 8 ● సంచిక 11 ● ఫిబ్రవరి 2026 ● వెల రూ.18/-

# తేటతెలుపు

తెలుగు మాసపత్రిక

## భావనలు

## నైతిక విలువలు ప్రత్యేక సంచిక








Available at Ramraj Showrooms And All Leading Textile Shops


గౌరవనీయులకు...
RAMRAJ
కాటన్
భారతీయ సంస్కృతి
నీతిమార్గం ఏది అనే విషయాన్ని మనకు చూపించి
ఆ మార్గంలో పయనించాల్సిన ఆవశ్యకతను అవగతం చేసి
జీవితాన్ని నీతినియమాలతో నడిపించే మార్గాలను గురించి విశదీకరించే
నైతిక విలువలు
ప్రత్యేక సంచిక
అనే ఉపయుక్తమైన పుస్తకాన్ని మీకు అందించడాన్ని
గర్వంగా భావిస్తున్నాము.

# గౌరవనీయులకు...

**నమస్కారం.**

మంచి కథలలో ఒక్కొక్కటి శక్తివంతమైన విత్తనాలు. దారి తెలియక తికమకపడుతుండేవారికి దిశానిర్దేశం చేసే పనిని కథల ద్వారా మన పూర్వీకులు ఇప్పటికీ నిరంతరముగా చేస్తూనేవున్నారు. కథల ద్వారానే పిల్లల యొక్క ప్రపంచం విస్తరిస్తోంది. చారిత్రక నాయకులు కూడ సాహిత్యం, ఇతిహాసం అంటూ కథల ద్వారా జీవిస్తున్నారు.

మన కుటుంబాలలో తాత - అవ్వలకు ముఖ్యమైన పని, మనుమలు-మనుమరాండ్రకు కథలు చెప్పడమే. నైతిక విలువలతో కూడిన కథలు. చేయదగినవి, చేయకూడనివి అంటూ ఆహారంలో మందును కలిపినట్లుగా, కథలలో కలగలిపి చెబుతుంటారు. కథలను వింటూ పెరుగుతుండే పిల్లలు, తమలో ఒక కథాప్రపంచాన్ని రూపొందించుకుంటుంటారు. సదరు కథలే పిల్లలను రూపుదిద్దుతుంటాయి.

ఇప్పటికీ రాత్రిపూట గ్రామాలలో నిర్వహించబడుతుండే వీధి నాటకాలలో సత్య హరిశ్చంద్ర నాటకం అత్యంత ప్రసిద్ధి చెందింది. సత్యానికి తగిన గుర్తింపుగా నిలిచిన ఇక్ష్వాకు వంశపు రాజు హరిశ్చంద్రుడు. తను ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి సర్వస్వం కోల్పోయి, చివరకు అన్నింటిని తిరిగి పొందిన హరిశ్చంద్రుని పౌరాణిక గాథ మనందరి మనస్సులలో ఒక శిలాశాసనంలాగ నిలిచిపోయింది.

సప్తఋషులలో ఒకరైన వశిష్ఠుడు ఒక సభలో, ''నా శిష్యుడైన హరిశ్చంద్రుడు, తన జీవితములో ఒక్క అబద్ధం కూడ చెప్పని వ్యక్తి. నిజాలను మాత్రమే మాట్లాడుతుంటాడు'' అంటూ గర్వంగా చెప్పాడు. వశిష్ఠుని మాటలను తప్పుగా నిరూపించాలనుకున్న విశ్వామిత్రుడు, ''మనిషి ఆ యా సందర్భాలకు తగినవిధంగా తనను తాను మార్చుకుంటుంటాడు. కాబట్టి మీ శిష్యుడు హరిశ్చంద్రుడు దారుణమైన పరిస్థితులు ఎదురైనప్పుడు సహజంగా అబద్ధాలు మాట్లాడుతుంటాడు. ఆ విషయాన్ని నేను తప్పక నిరూపిస్తాను'' అంటూ ఆ సభలో శపథం చేశాడు. ఆ ఋషులకు మధ్య ఏదో ఒక గొడవ జరుగుతూనే వుంటుంది. అటువంటి గొడవలలో ఇదొకటి.

వెంటనే విశ్వామిత్రుడు, తన తపోబలం ద్వారా ఒక రాక్షసుడిని మూర్ఖమైన అడవిపందిలాగ మార్చేశాడు. హరిశ్చంద్రుడు పెంచుతోన్న అందమైన పుష్పాలతో శోభిల్లుతోన్న పూదోటను ధ్వంసం చేసి రమ్మని పంపించాడు. సదరు అడవిపంది విశ్వామిత్రుని ఆనతిని శిరసావహించి, హరిశ్చంద్రుని నందనవనాన్ని ధ్వంసం చేసింది. అక్కడి పనివాళ్ళు ఆ పందిని అడ్డుకోలేకపోయారు. వెంటనే హరిశ్చంద్రుని దగ్గరకు ఉరుకులు పరుగులతో చేరుకుని, అడవిపంది చేస్తోన్న రచ్చను గురించి వివరించారు. ఆ పందిని చంపడమే తప్ప వేరే మార్గం కనిపించలేదు.

విలువిద్యలో నిష్ణాతుడైన హరిశ్చంద్రుడు గుఱ్ఱంపై స్వారీ చేస్తూ వెళ్ళి, అడవిపందిని సంహరించాలని నిర్ణయించుకున్నాడు. పంది రూపంలోనున్న రాక్షసుడు అటుఇటు పరుగులు పెడుతూనేవున్నాడు. హరిశ్చంద్రుడు కూడ ఆ అడవిపందిని తరుముకుంటూ చాలా దూరం వెళ్ళాడు. ఎటు వెదికినప్పటికీ, సదరు అడవిపంది కనిపించలేదు.

బాగా అలసిపోయిన హరిశ్చంద్రుడు, సమీపంలోనున్న సెలయేరులో నీళ్ళు త్రాగి, దాహం తీర్చుకుని, ఒక చెట్టునీడలో కూర్చున్నాడు. అప్పుడు అటుగా వచ్చిన ఓ పెద్దాయన హరిశ్చంద్రునికి ధర్మశాస్త్రాలను గురించి వివరించడం మొదలుపెట్టాడు. శిష్యుడిని వెదుక్కుంటూ వచ్చిన గురువులాగ, తను నేర్చుకున్నవాటన్నింటినీ హరిశ్చంద్రునికి బోధించాడు.

జనసంచారం లేని సదరు అడవిలో ఏమి చేస్తున్నారంటూ హరిశ్చంద్రుడు సదరు పెద్దాయనను ప్రశ్నించాడు. ''నా కుమార్తెకు పెళ్ళి చేసిన పిదప, నేనొక నిరుపేదగా మారిపోయాను. తలదాచుకునేందుకు చోటులేక దేశదిమ్మరిలాగ తిరుగుతున్నాను'' అంటూ వేదనాభరిత స్వరంతో చెప్పాడు ఆ పెద్దాయన. అతని పట్ల జాలిపడిన హరిశ్చంద్రుడు ''వయస్సు పైబడిన మీరు ఇకపై కష్టపడకూడదు. మా రాజసభకు వచ్చి, నన్ను చూడండి. మీకు కావలసిన ఐశ్వర్య సంపదను నేను, మీకు అందిస్తాను'' అంటూ వాగ్దానం చేసి, తన రాజ్యానికి చేరుకున్నాడు.

మరుసటిరోజు హరిశ్చంద్రుని రాజసభకు చేరుకున్న సదరు పెద్దాయన, ''మహారాజా! నాకు కావలసిన సంపదను అందిస్తానని మాటిచ్చారు. నాకు మీ రాజ్యం, మీ రాజసభ అంటూ అన్నీ కావాలి'' అని అడిగాడు. ఇచ్చినమాటను నెరవేర్చకపోయినట్లయితే, అబద్ధం చెప్పినట్లవుతుందని భావించిన హరిశ్చంద్రుడు, ఏమాత్రం ఆలస్యం చేయకుండా, తన దగ్గరవున్నవన్నీ దానం చేశాడు.

''ఇవన్నీ సరే, నేను నీకు అడవిలో బోధనలు చేశాను కదా! అందుకు తగిన గురుదక్షిణ ఎక్కడ?'' అంటూ ఆ పెద్దాయన ప్రశ్నించాడు. ఇచ్చేందుకు తన దగ్గర ఏమీ లేని స్థితిలో హరిశ్చంద్రుడు వేదనాభరితుడైపోయాడు. 'పెద్దాయన అడిగినవన్నీ అందిస్తాను' అంటూ ఇచ్చిన మాటను నెరవేర్చవలసివున్నందున, ఆ పెద్దాయనను


కొంతకాలంపాటు వేచియుండమని అభ్యర్థించాడు. తన భార్యాబిడ్డలతో కాశీకి చేరుకుని, పని చేయసాగాడు.

మహారాజుగానున్న హరిశ్చంద్రుడు, స్మశానంలో శవాలను కాల్చే పనికి చేరాడు. భార్యాబిడ్డలు ఒక ధనవంతుని ఇంట్లో పనికి చేరారు. రాజకుటుంబములో పుట్టి పెరిగినవారికి ఈ సంభవాలు అత్యంత కష్టంగా అనిపించాయి. తోటలో పనులను చేస్తున్నప్పుడు హరిశ్చంద్రుని కుమారుడు విష పాము కాటుతో చనిపోయాడు. తన కుమారునికి స్మశానములో అంత్యక్రియలను చేసేందుకు తగినన్ని డబ్బులు లేక నిస్తేజముగా నిలబడిపోయాడు హరిశ్చంద్రుడు. ఆయనకు ఏమి చేయాలో తెలియలేదు. కుమారుడు చనిపోవడం ఒక శోకమైతే, అతనికి అంత్యక్రియలను చేయలేకపోతుండటాన్ని తలచుకుంటూ హరిశ్చంద్రుడు, అతని భార్య చాలా వేదనలో మునిగిపోయారు.

అప్పుడు హరిశ్చంద్రుని చూసిన పెద్దాయన, ''ఎందుకు ఇన్నిన్ని కష్టాలను పడుతున్నావ్? ఇప్పుడు నువ్వు 'నేనిచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చలేకపోతున్నాన'ని చెప్పొచ్చుగా? దాని వలన ఈ సమస్యల నుంచి నువ్వు బయటపడొచ్చుగా?''అని అడిగాడు. అందుకు హరిశ్చంద్రుడు, ''ఆవిధంగా చెబితే, నేను మాట తప్పినవాడినవుతాను. హరిశ్చంద్రుడనైన నేను ఎట్టి పరిస్థితులలో ఇచ్చిన మాటను నెరవేర్చకుండా ఉండలేను. ఎన్ని కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ, మీకు ఇచ్చిన మాటను ఖచ్చితంగా నెరవేర్చుతాను''అని బదులిచ్చాడు. చెప్పినట్లుగానే, తననే ఒకరికి బానిసగా విక్రయించి, ఆ డబ్బులను పెద్దాయనకు గురుదక్షిణగా అందించి, హరిశ్చంద్రుడు తన వాగ్దానాన్ని ఖచ్చితముగా నెరవేర్చుతాడనే విషయాన్ని నిరూపించడం జరిగింది.

సదరు పెద్దాయన ఆకృతితో వచ్చిన విశ్వామిత్రుడు, ''ఎన్నెన్ని కష్టాలు ఎదురైనప్పటికీ, అబద్ధాలను మాట్లాడకూడదనే లక్ష్యాన్ని మానసికస్థైర్యంతో పాటించావు. నీ జీవితములో దారుణమైన కష్టాలను, నష్టాలను ఎదుర్కొన్నప్పటికీ, సత్యమార్గాన్నే అనుసరించావు. నీ కీర్తిప్రతిష్టలు ఈ భూమిపై శాశ్వతంగా విలసిల్లుతుంటాయి''అంటూ హరిశ్చంద్రుడిని హృదయపూర్వకంగా ఆశీర్వదించాడు. దానంగా స్వీకరించిన రాజ్యాన్ని తిరిగి హరిశ్చంద్రునికే అప్పగించాడు. హరిశ్చంద్రుని కుమారుని పునరుజ్జీవింపజేశాడు.

చిన్నవయస్సులో వినిన హరిశ్చంద్రుని కథే 'జీవితంలో అబద్ధాలను చెప్పకూడదు' అనే మానసిక బలాన్ని మహాత్మా గాంధీకి అందించింది. తమ జీవితపర్యంతం దానిని దృఢ చిత్తంతో పాటించారాయన. సత్యం అనే జ్యోతితో మన



దేశాన్ని ముందుకు నడిపించారు. ఒక సాధారణమైన బాలుడిని, మహాత్మా గాంధీగా రూపొందించడంలో హరిశ్చంద్రుని కథకు సింహభాగం ఉన్నదనే విషయం నిజం. ఇటువంటి స్ఫూర్తిదాయకమైన కథలను మన పూర్వీకులు మనకు అందించిన భాండాగారము.

నైతిక విలువలతో కూడిన కథలు బలమైన విత్తనాలు అనేదానికి గాంధీజీ జీవితమే ప్రత్యక్షసాక్ష్యం. ఆదర్శవంతమైన జీవితానికి దారిచూపించే మంచి కథలను మన తరువాతి తరానికి తెలియజేయడమనేది అత్యంతావశ్యకం. పిల్లలు మాత్రమే కాకుండా పెద్దలు కూడ నీరవనిస్సత్తువలతో, అధైర్యంతో ఉంటున్నప్పుడు, వారి యొక్క మనస్సులలో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని అందించే శక్తిని నైతిక విలువల కథలు కలిగివుంటుంటాయి. ఈ నెల తేటతెలుపు ప్రత్యేక సంచిక నైతిక విలువల యొక్క ఆవశ్యకతను తెలియజేస్తోంది.



The Culturepreneur

**గురుకృప**

**సర్వేజనా సుఖినోభవంతు!**

## కె.ఆర్. నాగరాజన్

**వ్యవస్థాపకులు**

**రామ్‌రాజ్ కాటన్**

# నైతిక విలువలను ఆహారంలాగ అందించండి!



ఒక పరుగుపందెంలో కుందేలును ఓడించిన తాబేలు కథ గురించి తెలియనివారంటూ ఉండరు. పిల్లలకు చెబుతుండే నీతి కథలలో అదొక ముఖ్యమైన కథ. పరుగుపందెమును వేగముగా ప్రారంభించిన కుందేలు, 'ఈ తాబేలు ఏమంత వేగంగా రాలేదుగా?' అనుకుని సగం దూరంలో నిద్రపోతుంది. నిదానంగా ముందుకెళ్ళిన తాబేలు విజయం అందుకుంటుంది. సోమరితనముతో అలక్ష్యంగా ఉంటుండే వారు ఓడిపోతారనే దానికి కుందేలు ఒక ఉదాహరణ. నిదానముగా కార్యనిర్వహణ చేసినప్పటికీ, ప్రయత్నాన్ని వదలకుండా నిరంతర కృషి చేస్తుండే వారికి విజయం తథ్యమనే దానికి తాబేలు ఓ ఉదాహరణ. ఈ కథ ప్రస్తుతం పలువిధాలైన రూపాలను పొందుతోంది. ఆవిధంగా సదరు కథ మారిన విషయం ఆసక్తికరమైనది. పిల్లలకు బాగా నచ్చుతుంది. 'వేగాతివేగంగా పరుగులు పెట్టుకుంటూ వచ్చిన కుందేలు, సగం దూరంలో ఎందుకు నిద్రపోవడం? ఇంకొన్ని నిముషాలు పరుగెత్తివున్నట్లయితే లక్ష్యాన్ని చేరుకుని, విజయాన్ని సాధించి, నిద్రపోయివుండొచ్చు కదా?' అనే ప్రశ్న తలెత్తుతుంటుంది. ఆ ప్రశ్న ద్వారా మొదలైనదే ఈ మార్పు.

ఈ కథలో కుందేలు నిద్రపోలేదు. వేగంగా పరుగులు పెట్టుకుంటూ వచ్చిన కుందేలు, వెనక్కి తిరిగి చూసి 'తాబేలు కనబడటం లేదే!' అనుకుంటూ సందిగ్ధతకు లోనయ్యింది. అది సమీపంలోకి వచ్చిన తదనంతరం, మిగతా దూరాన్ని చేరుదామనుకుంటూ ఒక మఱ్ఱిచెట్టు క్రింద నిలబడింది. అప్పుడు దూరంగా నీళ్ళ గలగల శబ్దాలు వినిపించాయి. అటువైపుకు వెళ్ళి చూస్తే, అక్కడొక జలపాతం. ఆ జలపాతంలో నీళ్ళను త్రాగి, కాసేపు ఈత కొడదామని భావించింది.

ఆ జలపాతం ప్రక్కన ఒక సన్యాసి కూర్చునివుండటాన్ని చూసి, ఆయన దగ్గరకెళ్ళి నమస్కరించింది. ''ఏం చేస్తున్నావు కుందేలూ?'' అని అడిగాడు.

''నేను ఒక పరుగుపందెంలో పాల్గొన్నాను'' అని చెప్పింది కుందేలు. వారి సంభాషణ కొనసాగింది.



''ఎందుకు పరుగుపందెంలో పాల్గొన్నావు?''

''అడవిలోనున్న అన్ని జంతువులకు నా వేగాన్ని నిరూపించాలి కదా?''

''సరే, అలాగ పందెంలో పాల్గొని నిరూపించాల్సిన అవసరం ఏముంది?''

''నాకు పతకం దొరుకుతుంది. బహుమతి లభిస్తుంది. డబ్బులు లభిస్తాయి. దానితో నాకు అవసరమైన ఆహారాన్ని పొందవచ్చు''

''ఇక్కడ ఎంతో ఆహారం ఉందే? ఈ అడవి అంతా గడ్డి, పండ్ల చెట్లు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఎన్నెన్నో కాయలు క్రిందికి రాలి పడుతున్నాయి. ఇంకేం కావాలి?''

''అయినప్పటికీ, నాకు తగిన గౌరవమర్యాదలు లభించాలి కదా? ఈ ప్రపంచంలోనే అత్యంత వేగంగా పరుగెత్తే కుందేలు అంటూ అందరూ నన్ను గుర్తు పెట్టుకోవాలి కదా?''

''సరే, వేయి సంవత్సరాలకు ముందు ఇక్కడ జీవించిన వేగవంతమైన జింక, చాలా పెద్ద ఏనుగు, బలమైన సింహం అంటూ ఎవరి పేరు అయినా నీకు తెలుసా?''

''తెలియదు''

''మరి, నీ పేరును మాత్రం అందరూ గుర్తుపెట్టుకుంటారని ఎలా భావిస్తున్నావు?''అని సన్యాసి ప్రశ్నించడంతో, కుందేలు ఎటువంటి సమాధానం చెప్పలేకపోయింది. ''సరే, ఎవరితో పోటీ పడుతున్నావు?''అని మరలా ప్రశ్నించాడు ఆ సన్యాసి.

''తాబేలుతో పోటీ పడుతున్నాను?''

''ఈరోజు తాబేలు ముందు నీ వేగాన్ని నిరూపించుకోవాలి. రేపు ఒక జింక వస్తుంది. ఇంకొకరోజు ఒక చిరుతపులి వస్తుంది. జీవితపర్యంతం అందరితో పోటీపడుతూ నీ వేగాన్ని నిరూపించుకుంటూనే వుంటావా?''అని సన్యాసి ప్రశ్నించగా సదరు కుందేలు ఆలోచించింది.

''మీరు చెబుతున్నది సరైనదే. నా కన్నులను తెరిపించారు. ఎవరెవరితోనే పోటీ పడుతుండటం నా పని కాదు. నా జీవితాన్ని నా ఇష్టప్రకారం జీవించడమే సరైన పద్ధతి. నేను ఈ పందెం నుంచి తొలగిపోతున్నాను''అని చెప్పిన కుందేలు, ఆ సన్యాసికి కృతజ్ఞతలను తెలియజేసి, జలపాతం దగ్గరకెళ్ళి సంతోషానందాలతో గెంతులేయసాగింది.

'కుందేలు పందెంలో ఓడిపోయివుండొచ్చు. కానీ, తన జీవితాన్ని తిరిగి పొందింది'అంటూ ముగుస్తుంది ఆ కథ. అర్థవంతంగాని పోటీలలో పాల్గొనకుండా, ఇతరులను చూస్తూ ఏదో ఒకటి చేయకుండా, జీవితంలో అనుకున్నవి చేసినట్లయితే, తప్పకుండా విజయాన్ని సాధించవచ్చనే విషయాన్ని ఈ కథ అవగతం చేస్తోంది.



శరీరానికి ఆరోగ్యాన్ని అందించే పలు ఆహార పదార్థాలు ఏమంత రుచికరంగా ఉండవు. అందువల్లనే పిల్లలు తినేందుకు ఇష్టపడరు. కష్టపడి ఆ యా ఆహార పదార్థాలను తినిపించినట్లుగా, నీతి కథలకు కూడ వారికి చెప్పాలి. చేదు మాత్రలకు తీపి కలిపి అందించినట్లుగానే, కథల్లో నీతినియమాలను జోడించారు మన పూర్వీకులు. ఏది తప్పు? ఏది ఒప్పు? అని విభజించి చూసేందుకు నైతిక విలువలు సాయపడుతుంటాయి. మంచికీ, చెడుకీ మధ్య నిలబడి చూస్తూ, మంచి విషయాలవైపు నిలబడటాన్ని నేర్పిస్తుంటాయి. ఎటువంటి మనుషులతో స్నేహబంధాన్ని బలపరుచుకోవాలనే విషయాలను అవగతం చేస్తుంటాయి.

కుటుంబం, బంధుమిత్రుల బృందం, పాఠశాల, సమాజం, ప్రభుత్వం అంటూ నైతిక విలువలను ఎక్కడైనా నేర్చుకోవచ్చు. వాటినే దైనందిన అలవాట్లుగా, జీవితలక్ష్యాలుగా ఒక్కొక్కరికీ మారుతుంటాయి. ఒకరి యొక్క ప్రవర్తనను, మాటలను, పనులను, గుణగణాలను అవే తీర్మానిస్తుంటాయి. పిల్లలు పెరిగే కొలదీ ఆ నీతినియమాలు వారికి గౌరవాన్ని ఏర్పరుస్తుంటాయి. ఒకరు ఎటువంటి వ్యక్తిగా రూపొందుతారనే విషయాన్ని, అతను పాటించే నీతినియమాలే తీర్మానిస్తుంటాయి. జీవిత పర్యంతం సవాళ్ళను, సమస్యలను ఎదుర్కొని బయటపడేందుకు ఈ నైతిక విలువలే సాయపడుతుంటాయి.

## పిల్లలకు నైతిక విలువలను బోధించడం ఎలాగ?

- ఎటువంటి పద్ధతినైనా పసిప్రాయంలో నేర్పించినట్లయితే, అది జీవితపర్యంతం అలవాటుగా మారిపోతుంటుంది. ప్రాథమిక నైతిక విలువలను పసిప్రాయంలోనే నేర్పించండి. ఏదైనా అవసరమైనప్పుడు, 'ప్లీజ్' అంటూ అణకువతో అభ్యర్థించడం, ఎవరైనా సాయాలు చేసినప్పుడు, 'థ్యాంక్స్'అని చెప్పడం సహజమైన అలవాటుగా మారిపోతుంటుంది.
- తల్లిదండ్రులు చెప్పే విషయాలను మాత్రమే కాదు, తల్లిదండ్రులు చేస్తోన్న పనులను చూస్తూ పిల్లలు నేర్చుకుంటుంటారు. పిల్లలు పాటించవలసిన మంచి పద్ధతులు పెద్దలలో ఉండాలి. అందరితో ఆప్యాయంగా మాట్లాడటం, కోపగించుకోకుండా ఉండటం, తగిన సమయంలో తోడుగా ఉండటం అంటూ పిల్లలకు ఒక మంచి రోల్‌మోడల్‌గా ఉండాలి.
- మీ జీవితంతో నైతిక విలువలను పాటించడం వలన ఎటువంటి ఫలితాలను పొందేరనే విషయాన్ని కథలులాగ వారికి వివరించి చెప్పాలి. వారు కూడ ఆ యా విలువను పాటిస్తుంటారు.
- పిల్లలు నైతిక విలువలను పాటించేవిధముగా సాయపడండి. వారి యొక్క మంచి పద్ధతులను అభినందించండి. తత్ఫలితంగా పిల్లలు ఉత్సాహవంతులై మంచి పద్ధతులను పాటిస్తారు. ●



# సహనంతో పాఠాలను నేర్పించండి!

ఒక తల్లి, దిండులకు కవర్లను వేస్తూనే, తన చిన్నారి కుమారునికి కూడిక, తీసివేత లెక్కలను చెప్పసాగింది. ఎన్నిసార్లు చెప్పినప్పటికీ, ఆ బాలుడు లెక్కలను సరిగ్గా చేయడం లేదు. ఆ తల్లి కోపంతో కుమారుడిని తిట్టసాగింది. ఆ బాలుడు భయంతో ఏడ్వటం మొదలుపెట్టాడే తప్ప, లెక్కలను సరిగ్గా చేయలేదు. ఒక దశలో ''నువ్వేమీ చదవొద్దు...పో... బయటకెళ్ళి ఆడుకో...పో...''అంటూ గదమాయించింది ఆ తల్లి.

ఆ తదనంతరం ఆ తల్లి, తన కొడుకుపైనున్న కోపాన్ని దిండు కవర్లపై చూపించసాగింది. దిండులను కవర్లలో పెట్టి విదిలించింది. ఆ విధంగా రెండు దిండులను విదిలించిన తరువాత ఆ విషయాన్ని గమనించింది. ప్రారంభంలో దిండును, ఆ కవరులోకి మెల్లగా పెట్టాము. మెల్లగా దూర్చి కదుపుతూ కవరులోకి దిండు చేరుకోగానే, దానిని వేగంగా విదిలిస్తూ ఒత్తిడి పెడుతున్నామనే విషయాన్ని గ్రహించింది.

మెత్తమెత్తగానున్న దిండును పలుచగానున్న కవరులోకి పెట్టేందుకు ఇంతటి సామర్థ్యం అవసరమవుతోంది. ఏడేళ్ళ కుమారుడి మెదడులో లెక్కలను చొప్పించేందుకు తనకు ఎంతటి సహనం కావాలి? అయితే 'సహనమే లేకుండా కుమారుడిని తిట్టామే?'అనుకుంటూ వేదన చెందింది.

కుమారుడిని ఆప్యాయంగా పిలిచింది. కాసేపు తన కుమారునికి ఇష్టమైన ఆటలను ఆడుకునే విధంగా అనుమతించి, నిదానంగా కూడిక, తీసివేత లెక్కలను చెప్పింది. ఆ బాలుడు ఒకవిధంగా లెక్కలను బాగా అర్థం చేసుకున్నాడు. ఆ తదనంతరం, అరగంటలోపు ఎటువంటి లెక్కలను ఇచ్చినప్పటికీ, తప్పులు లేకుండా చేయడం మొదలుపెట్టాడు. చక్కగా చదవడం మొదలుపెట్టాడు.

బోధించే ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఈవిధమైన సహనం అత్యంతావశ్యకం. పిల్లలు అర్థం కావడంలేదని చెప్పినప్పటికీ, సహనాన్ని పాటిస్తూ, ఆ యా పాఠాలను వారికి అర్థమయ్యేవిధంగా చెప్పాలి.

# ఆకలైతే తప్పకుండా వస్తారు!

యువతరాన్ని పిల్లిపిల్లలతో పోల్చుతూ పలు విషయాలను చెబుతుంటారు. పిల్లిపిల్లలకు మీరు ఎటువంటి ముద్దుపేరు పెట్టి, దానిని గారాబంగా పిలిచినప్పటికీ, ఆ పిల్లిపిల్లలు తల త్రిప్పి చూడవు. అలక్ష్యంతో ఉంటుంటాయి. యువతరం కూడ ఆవిధంగానే ఉంటుంటుంది. మీరు ఎంతటి శ్రద్ధాభక్తులతో చెప్పినప్పటికీ, పిల్లులు ఆ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవు. 'వీరు, మనకు ఈ పనులను తప్పక చేయాలి'అనే భావనతో ఉంటుంటాయి. యువతరం కూడ ఆవిధంగానే ఉంటుంటుంది!

ఒక పిల్లిపిల్ల ఇంట్లోనుంచి బయటకు వెళ్ళున్నప్పుడు, దానితోపాటు తల్లి పిల్లి, లేక వేరే పెద్ద పిల్లి ఉండవు. ఆ పిల్లిపిల్ల ఒంటరిగా వెళ్తుంటుంది. భద్రత కోసం పెద్దలు తోడుగా వస్తామని చెప్పినప్పటికీ, యువతరం ఇష్టపడటం లేదు. బయట ఎక్కడెక్కడో సంచరించి, రాత్రిపూట ఆలస్యంగా, శబ్దం చేయకుండా ఇంట్లోకి వస్తుండే పిల్లిలాగానే యువతరం ఇంటికి చేరుకుంటుంటారు.

ఒకరోజు ఒక పిల్లి ఈవిధంగానే బయటకు వెళ్ళింది. రాత్రిపూట ఇంటికి చేరుకోలేదు. ఆ పిల్లిని పెంచుతోన్న వ్యక్తి ఆందోళన చెందాడు. మరుసటిరోజు ప్రాతఃకాలాన్నే ఆ పిల్లిని వెదుకుతూ బయలుదేరాడు. ఆ పిల్లి తోటలోని ఒక చెట్టుకొమ్మపై చాలా ఎత్తులో కూర్చుని, 'మియ్యావ్...మియ్యావ్... 'అంటూ అరవసాగింది. ఆయన పిలిచినప్పటికీ, అది కిందికి దిగి రాలేదు.

'రాత్రిపూట చీకట్లో తెలియకుండా అది చెట్టు కొమ్మపైకి ఎక్కింది. ఇప్పుడు కిందికి దిగేందుకు దారి తెలియకుండా, చెట్టు


# స్వతంత్రంగా ఆలోచించాలి!

ఎనిమిదేళ్ళ బాలుడు తరగతి గదిలో కూర్చునివున్నాడు. ఆ వయస్సులో అతనికి పాఠశాల పట్ల, ఉపాధ్యాయినీఉపాధ్యాయుల పట్ల విరక్తి భావన ఏర్పడింది. ఆరోజు కొత్తగా చిత్రలేఖన ఉపాధ్యాయుడు టాయ్‌చికోవా చిత్రలేఖనాన్ని నేర్పించేందుకు వచ్చాడు.

''మీ మనస్సులో ఎలాగ అనిపిస్తోందో, అలాగే చిత్రీకరించండి'' అని చెప్పాడు. ఆయన మాటలను విన్న సదరు బాలునికి ఆశ్చర్యముగా అనిపించింది. ఎప్పుడూ చిత్రలేఖన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు బ్లాక్‌బోర్డుపై ఒక చిత్రాన్ని చిత్రీకరించి, దానిని చూసి చిత్రాన్ని గీయమని చెబుతుంటారు. అయితే ఈ చిత్రలేఖన ఉపాధ్యాయుడు టాయ్‌చికోవా 'మీరు స్వతంత్రంగా చిత్రీకరించండి' అని చెప్పాడు. ఈ విధమైన స్వతంత్రంతో ఆ బాలుడికి అపరిమితమైన ఆనందం లభించింది. గభాల్న రంగు పెన్సిళ్ళను తీసుకుని చిత్రీకరించడం మొదలుపెట్టాడు. చిత్రీకరించిన బొమ్మ చక్కగానే ఉంది. అయితే, దానిలో ఏదో ఒక లోపం ఉన్నట్లుగా అనిపించింది. వెంటనే నీటిలో చేతివ్రేళ్ళను తడుపుకుని, ఆ రంగులపై పూయడం జరిగింది. తత్ఫలితంగా ఆ చిత్రం భిన్నమైన రంగులతో చిత్రీకరించినట్లుగా ఉంది.

అందరూ చిత్రీకరించడం ముగిసిన పిదప, చిత్రలేఖన ఉపాధ్యాయుడు టాయ్‌చికోవా, అన్ని చిత్రాలను తీసుకుని గోడకు అంటించాడు. ఆ బాలుడు చిత్రీకరించిన చిత్రం విభిన్నంగా కనిపించడంతో, మిగతా విద్యార్థినీవిద్యార్థులు హేళనగా నవ్వారు. చిత్రలేఖన ఉపాధ్యాయుడు వారిని ఖండించాడు.

''నీటిలో వ్రేళ్ళను ముంచి రంగులపై అద్దడమనేది అద్భుతం! ఈ విధంగానే ఏవిషయాన్నైనా ఆనందిస్తూ చేయాలి. ఎవరో ఒకరు చేసిన దానిని కాపీ కొట్టి చేయడమనేది సృజనాత్మకత కాదు'' అంటూ ఆ బాలుడిని ప్రశంసించాడు. ఆరోజు చిత్రీకరించినవాటిలో అత్యుత్తమ చిత్రంగా ఆ బాలుడు చిత్రీకరించిన చిత్రాన్నే ఎంపిక చేశాడు. ఆరోజు నుంచి సదరు బాలుడు తన ఆలోచనావిధానం ప్రకారం పనులను చేయసాగాడు.



జపాన్ దేశంలో 100 సంవత్సరాలకు ముందు, జరిగిన సంఘటన ఇది. ఆ బాలుడు తదనంతరకాలంలో, ప్రపంచంలో ఒక గొప్ప చలనచిత్ర దర్శకునిగా ఎదిగాడు. ఇప్పుడు కూడ చలనచిత్రకళను నేర్చుకునేందుకు వస్తుండే విద్యార్థినీవిద్యార్థులు 'ప్రత్యేకమైన చలనచిత్రాలను తీయడం ఎలాగ?' అనే విషయాన్ని ఆయన చలనచిత్రాలను చూసే నేర్చుకుంటున్నారు. ఆయనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన చలనచిత్ర దర్శకుడు అకిరో కురుసోవా.

పిల్లలను స్వతంత్రంగా ఆలోచించమని చెప్పడంకంటే, అత్యుత్తమమైన మంచి విషయం వేరొకటి లేదు.

కొమ్మపై కూర్చుని అరుస్తోంది' అంటూ ఆయన తప్పుగా అర్థం చేసుకున్నాడు. వెంటనే అగ్నిమాపక దళానికి ఫోన్ చేశాడు. అతనితో మాట్లాడిన అగ్నిమాపకదళ ఉద్యోగి మంచి అనుభవశాలి. సమస్యను విన్న సదరు ఉద్యోగి, ''ఏమాత్రం ఆందోళన చెందవద్దు. పిల్లులకు మనకంటే చెట్లను ఎక్కడం బాగా తెలుసు.



దానికి చెట్టు నుంచి దిగడం తెలియక అరవడం లేదు. దానికి పొద్దుపోవాలి కదా! అందుకే అరుస్తోంది. త్వరగా దానంతటకు అదే చెట్టుపైనుంచి క్రిందికి దిగి, ఇంటికి చేరుకుంటుంది'' అని చెప్పాడు.

ఆయన సమాధానపడకుండా, ''అది ఎప్పుడు చెట్టుపైనుంచి కిందికి దిగుతుంది?'' అని అడిగాడు. ''దానికి ఆకలైనప్పుడు తప్పకుండా వస్తుంది'' అంటూ బదులిచ్చాడు సదరు అగ్నిమాపకదళ ఉద్యోగి. అతను చెప్పినట్లుగానే ఒక గంటలోపు చెట్టుపైనుంచి కిందికి దిగి, ఇంటికి చేరుకున్న పిల్లి, తన కోసం పెట్టిన పాలను త్రాగింది.

పిల్లలను తలుచుకుంటూ ఆందోళన చెందవద్దు. వారికి తెలుసుకోవాలనే ఆసక్తి ఏర్పడినప్పుడు, ఆప్యాయతానురాగాల కోసం ఆశిస్తే ఖచ్చితంగా పెద్దలను వెదుక్కుంటూ వస్తారు.



# మూడు ఉపదేశాలు!

పెండ్లి అయిన యువదంపతులు ఒక గ్రామంలో ఉన్నారు. పెద్దగా వనరులులేని ఆ గ్రామంలో ఆదాయానికి ఎటువంటి మార్గం లేదు. అందువలన బ్రతుకుతెరువు కోసం బహుదూరంలోనున్న నగరానికి వెళ్ళాలని ఆ యువకుడు నిర్ణయించుకున్నాడు. ''ఏదో ఒక పనిలో చేరి, కఠోరశ్రమను చేసి, ఎక్కువ డబ్బులతో తిరిగి వస్తాను. ఎన్ని సంవత్సరాల కాలం పడుతుందో నాకు తెలియదు. నా కోసం కాచుకునివుండు''అని తన భార్యకు చెప్పి, బయలుదేరాడు.

రవాణాసౌకర్యాలు మరియు సమాచారవ్యవస్థ సౌకర్యాలు ఏమంతగా లేని ఆ కాలంలో అతను 20 రోజులపాటు నడుచుకుంటూ ఒక నగరానికి చేరుకున్నాడు. అక్కడ పలువిధాలైన పరిశ్రమలను నిర్వహిస్తోన్న ఒకపారిశ్రామికవేత్తను ఉద్యోగం కోసం అభ్యర్థించాడు. ''నేను ఇంటికి వెళ్ళాలనుకున్నప్పుడు నన్ను పంపించండి. అప్పటి వరకు నా జీతాన్ని మీ దగ్గరే పెట్టుకోండి. నేను ఊరుకు వెళ్తున్నప్పుడు, నా మొత్తం జీతాన్ని తీసుకెళతాను''అని చెప్పాడు. అందుకు సదరు పారిశ్రామికవేత్త అంగీకరించాడు.

అక్కడ అతనికి బస చేసేందుకు ఒక ఇల్లు, మూడుపూటలా భోజనం లభించింది. కఠోరశ్రమను చేస్తోన్న అతనిపట్ల పారిశ్రామికవేత్తకు సదభిప్రాయం ఏర్పడింది. ఆవిధంగా అతను, కార్యనిర్వాహకునిగా పదోన్నతి పొందాడు.

18 సంవత్సరాల తదనంతరం, తను ఊరుకు వెళ్ళాలనుకుంటున్నట్లుగా సదరు పారిశ్రామికవేత్తకు చెప్పాడు. ''సరే, ఇన్నేళ్ళ నీ కృషికి చెందిన జీతం నా దగ్గరే భద్రంగా ఉంది. నీకు డబ్బులు కావాలా? లేకపోతే నేను చెప్పాలనుకుంటున్న మూడు ఉపదేశాలు కావాలా? ఈ రెండింటిలో ఒకటి మాత్రమే అందిస్తాను. మార్గమధ్యంలో గజదొంగలు ఉండవచ్చు. వాళ్ళు నీ డబ్బులను దోచుకోవచ్చు. అదే సమయంలో నా ఉపదేశాలు జీవితపర్యంతం నీకు మార్గనిర్దేశం చేస్తుంటాయి. నీకు ఏది కావాలనే విషయమై బాగా ఆలోచించి, ఆ విషయాన్ని రేపు ఉదయాన్నే చెప్పగలవు''అంటూ వివరించాడు సదరు పారిశ్రామికవేత్త.

అతను రాత్రంతా కూర్చుని ఆలోచించాడు. డబ్బులను తీసుకెళుతూ మార్గమధ్యంలో గజదొంగల దగ్గర కోల్పోవడం కంటే, ఉపదేశాలను వినడమే ఫర్వాలేదనుకుంటూ తీర్మానించుకున్నాడు. ఇన్ని సంవత్సరాలపాటు కష్టించి ఒట్టి చేతులతో ఇంటికి వెళ్ళడమనేది అతనికి విపరీతమైన మానసిక వ్యథను కలిగించింది. అయినప్పటికీ, ఇంతకాలంపాటు తనను ఆప్యాయతానురాగాలతో చూసిన ఆ పారిశ్రామికవేత్త, తన క్షేమంకోసమే దేనినైనా చెబుతాడని విశ్వసించాడు.

మరుసటిరోజు పారిశ్రామికవేత్త ముందుకు వెళ్ళి, ''అయ్యా, నాకు డబ్బులు వద్దు. మీ ఉపదేశాలే కావాలి''అని అభ్యర్థించాడు. సదరు పారిశ్రామికవేత్త మూడు ఉపదేశాలను క్లుప్తంగా చెప్పాడు.

1. జీవితంలో ఎట్టి పరిస్థితులలో అడ్డదారులో వెళ్ళొద్దు. ఏ మాత్రం తెలియని మార్గములో అకస్మాత్తుగా వెళ్ళడం ప్రాణానికే ప్రమాదాన్ని ఏర్పరుస్తుంటుంది.

2. హడావిడిగా ఏ ఒక్క విషయంలో తలదూర్చవద్దు. అది చెడు విషయంగా ఉన్నట్లయితే నిన్ను బాధిస్తుంటుంది.

3. కోపావేశాలతో, వ్యథాభరితంగా ఉన్నప్పుడు ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోవద్దు. తదనంతరం ఆ విషయమై నువ్వు వేదన చెందినప్పటికీ, సదరు నిర్ణయం వలన కోల్పోయినదానిని తిరిగి పొందేందుకు కుదరదు.

ఈ ఉపదేశాలను చేసిన పారిశ్రామికవేత్త, ‘‘నడుచుకుంటూ వెళితే, మీ ఊరును చేరుకునేందుకు చాలాకాలం పడుతుంది. నేను ఎద్దుల బండిని ఇస్తాను. 10 రోజులలో మీ ఊరును చేరుకోవచ్చు’’అని చెబుతూ ఎద్దులబండిని అతనికి ఇచ్చాడు. దారిలో భోజనాలు చేసేందుకు, సత్రంలో తలదాచుకునేందుకు తగినంత డబ్బులను అందించాడు. ఆయన ఇంట్లో వండిన కేక్ వంటి ఒక ఆహార పదార్థాన్ని ఒక పాత్రలో పెట్టి అతనికి అందించాడు. ‘‘ఎంతగా ఆకలిగా అనిపించినప్పటికీ, మార్గమధ్యంలో దీనిని తినవద్దు. ఇంటికి వెళ్ళిన తరువాత నీ భార్యతోపాటు కూర్చుని తిను. అదే నీకు అలవికానంత సంతోషాన్ని అందిస్తుంది’’అని చెప్పాడు.

ఆయన చెప్పిన ఏ ఒక్క విషయాన్నీ అతను మరచిపోలేదు. వాటిని తప్పకుండా పాటిస్తానని చెప్పి బయలుదేరాడు. మొదటిరోజు పయనం ముగుస్తోన్న సమయంలో ఒక బాటసారి, ‘‘నేను కూడ మీ బండిలో రావచ్చా?’’అని అడిగి, బండిపైకి ఎక్కి కూర్చున్నాడు. ఇతను వెళ్ళాల్సిన ఊరును గురించి అడిగి తెలుసుకున్న బాటసారి, ‘‘ఆ ఊరుకు వెళ్ళేందుకు ఎందుకు ప్రధాన రహదారిలో వెళ్తున్నావు? 10 రోజుల సమయం పడుతుందే. ప్రక్కనున్న కొండలకు మధ్య ఒక అటవీమార్గం ఉంది. ఆ దారిలో వెళితే నాలుగు రోజులలో మీ ఊరును చేరుకోవచ్చు’’అని చెప్పాడు.

అతను చెప్పిన మార్గంలో వెళ్ళేందుకు బండిని త్రిప్పిన అతనికి, ఆ పారిశ్రామికవేత్త బోధించిన మొదటి ఉపదేశం గుర్తుకొచ్చింది. అడ్డదారిలో వెళ్ళడం ప్రమాదకరం. ‘‘ఎన్ని రోజులైనప్పటికీ ఫర్వాలేదు. నేను ప్రధాన రహదారిలోనే వెళ్తాను’’అనుకుంటూ బండిని ప్రధాన రహదారివైపు మళ్ళించాడు.



రెండురోజుల తరువాత ఒక సత్రంలో రాత్రిపూట బస చేసేందుకు ఆగినప్పుడు, సదరు అటవీమార్గంలో కొండచరియలు విరిగిపడి, ఎంతోమంది చనిపోయినట్లుగా వార్త అందింది. పారిశ్రామికవేత్త ఉపదేశం తనను కాపాడిందని సంతోషించాడు.

సత్రంలో రాత్రిపూట భోజనం చేసి నిద్రపోతున్నప్పుడు, గదికి వెనుకభాగంలో ఏదో ఒక శబ్దం వినిపించింది. కళ్ళు తెరిచి చూశాడు. ఒక విచిత్రమైన కూత వినిపించింది. నిద్రాసమయంలో తలుపును తెరిచేందుకు వెళ్ళిన అతనికి పారిశ్రామికవేత్త చెప్పిన రెండవ ఉపదేశం గుర్తుకొచ్చింది. ‘హడావిడిగా ఏ ఒక్క విషయంలో తలదూర్చవద్దు.’ శబ్దం వినబడితే వినబడనీయమని పడుకుని నిద్రపోయాడు.

మరుసటిరోజు ఉదయం సత్రం యజమాని దగ్గర, రాత్రి వినిపించిన విచిత్రమైన కూతలను గురించి అడిగాడు. ‘‘మంచిదే జరిగింది. మీరు తలుపును తెరువలేదు. గజదొంగలు ఈవిధంగానే విచిత్రమైన కూతలు పెడుతుంటారు. మీరు తలుపును తెరిచివున్నట్లయితే, మిమ్మల్ని కొడుతూ గాయపరిచి, మీ దగ్గరున్నవన్నీ దోచుకుపోయేవారు’’అని చెప్పాడు సత్రం యజమాని. ఉపదేశాలను బోధించిన పారిశ్రామికవేత్తకు మరలా కృతజ్ఞతలను తెలియజేసుకున్నాడు.

మరికొన్ని రోజులు పయనించి, ఒక రాత్రి సమయములో సొంతూరుకు చేరుకున్నాడు. ఇంట్లోకి వెళుతున్నప్పుడు అతనికి కనబడిన దృశ్యం విభ్రాంతికి గురిచేసింది. ఇంట్లో వెలుగుతున్న దీపపుకాంతిలో, అతని భార్య ఒడిలో ఎవరో ఒకతను తలనుపెట్టి పడుకునివుండటం గడప తెరలోనుంచి కనిపించింది. వెంటనే లోపలకు వెళ్ళి ఇద్దరినీ చంపేద్దామని అనిపించింది. ‘కోపావేశముతో ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోవద్దు’అంటూ పారిశ్రామికవేత్త చెప్పిన ఉపదేశం గుర్తుకొచ్చింది.

మెల్లగా ఇంట్లోకి వెళ్ళాడు. అతడిని చూడగానే సంతోషానందాలతో కేకలు వేసిన అతని భార్య, ‘‘రేయ్, మీ నాన్న వచ్చాడురా’’అని చెప్పింది. అతను ఉద్యోగం కోసం ఊరుని విడిచి వెళ్తున్నప్పుడు తన భార్య గర్భవతి అనే విషయం తెలిసింది. తను ఆ సంగతిని మరచిపోయాడు. ఆ తదనంతరం జన్మించిన తన కుమారుడిని ఇప్పుడే తను చూస్తున్నాడు. పారిశ్రామికవేత్త బోధించిన మూడవ ఉపదేశం కూడ తనను, తన కుటుంబాన్ని కాపాడిన విషయాన్ని గ్రహించిన అతను, సదరు పారిశ్రామికవేత్తకు మనసారా కృతజ్ఞతలను తెలియజేసుకున్నాడు.

పారిశ్రామికవేత్త ఇచ్చిన కేక్‌ను తినేందుకు ముగ్గురూ కూర్చున్నారు. పాత్రలోనుంచి దానిని తీసుకుని చాకుతో కోస్తున్నప్పుడు, దానిలోనుంచి బంగారపు నాణేలు వరుసగా క్రిందపడ్డాయి. అతనికి ఇవ్వాల్సిన జీతము కంటే అధికమొత్తాన్ని సదరు పారిశ్రామికవేత్త బంగారునాణేలుగా అందించాడు.

ఉపదేశాలు ఎప్పుడూ మనలను కాపాడుతుంటాయి! ●

## చిన్న పాపం... పెద్ద పాపం!



ఒక సాధువును కలుసుకునేందుకు ఇద్దరు వచ్చారు. మొదటి వ్యక్తి, ''నేనొక పెద్ద పాపాన్ని చేశాను స్వామీ! దానినే తలుచుకుంటూ నా మనస్సు నిత్యం వ్యథాభరితమైపోతోంది. నేను ఈ పాపం నుంచి బయటపడేందుకు కుదరదా?''అని అడిగాడు. రెండవ వ్యక్తి, ''నేను, ఇతని స్థాయికి పెద్ద పెద్ద పాపాలనేమీ చేయలేదు. చిన్న చిన్న దొంగతనాలు, ఏమార్చడం వంటి చిన్న చిన్న తప్పులను ఎన్నింటినో చేశాను. ఆ దేవుడు దండించేస్థాయికి అవి ఏమంత పెద్ద తప్పులా ఏమిటి?''అంటూ ప్రశ్నించాడు.

సాధువు ఇద్దరివైపు చూశాడు. మొదటి వ్యక్తిని చూస్తూ, ''నువ్వెళ్ళి ఒక పెద్ద బండరాయిని మోసుకుని రాగలవు''అని చెప్పాడు. రెండవ వ్యక్తిని చూస్తూ, అతనికి ఒక బుట్టను అందించి, ''నువ్వెళ్ళి ఈ బుట్ట నిండుగా చిన్న చిన్న రాళ్ళను తీసుకుని రాగలవు''అని చెప్పాడు.

ఇద్దరూ ఆవిధంగానే చేశారు. ఇప్పుడు ఆ సాధువు, ''సరే, మీరిద్దరూ తీసుకుని వచ్చిన వాటిని ఏ చోటు నుంచి సేకరించారో, ఆ చోటులోనే పెట్టి, తిరిగి రాగలరు''అంటూ చెప్పాడు.

## ఎవ్వరూ అడ్డుకునేందుకు కుదరదు!

ఒక బాలుడికి, తమ పాఠశాల టెన్నిస్‌జట్టులో చేరి, ఆడాలనేది కల. ఆ పాఠశాలలో క్రీడలలో పాల్గొన్న పలువురు ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్రీడాకారులుగా ఎదిగి, కీర్తిప్రతిష్ఠలతో ధనవంతులుగా మారిపోయారు. తను కూడ వారిలాగ పురోభివృద్ధిని సాధించాలని సదరు బాలుడు ఆశించాడు.

అయితే శిక్షణకు తగిన ఫీజును చెల్లించి, శిక్షణను పొందేందుకు, ఖరీదైన రాకెట్‌ను, బంతులను కొనుక్కుని ఆడుకునేందుకు తగిన వసతి సౌకర్యాలు అతనికి లేవు. ఇంట్లోనే ప్రతిరోజూ గంటల తరబడి ఆడుతుండేవాడు. సాధారణమైన టెన్నిస్ రాకెట్‌ను కొనుక్కుని, బంతిని గోడపైకి కొడుతూ ఆడటం మొదలుపెట్టాడు. కొన్ని వారాలలో గోడపైకి కొట్టిన బంతి ఎలాగ వచ్చినప్పటికీ, దానిని తిరిగి కొట్టడం అతనికి బాగా అలవాటైపోయింది. బంతి ఎంత గందరగోళంగా వస్తున్నప్పటికీ, దానిని చక్కగా త్రిప్పికొట్టడమనేది ఆ బాలుడికి బాగా అలవాటైపోయింది.

ఆ సంవత్సరం పాఠశాలజట్టులో ఆ బాలుడినే ప్రప్రథమంగా శిక్షకుడు ఎంపిక చేయడం జరిగింది. అందుకు ఆ శిక్షకుడు చెప్పిన కారణం, ''నీకు చక్కగా ఆడటం తెలియకపోవచ్చు. కానీ, ఒక్కొక్క బంతిని చక్కగా త్రిప్పి కొడుతున్నావు. విజయాన్ని అందుకునేందుకు అదే ముఖ్యాతిముఖ్యం.'' ఒక విషయాన్ని స్థిరచిత్తంతో, నిత్యం ఒకరు చేస్తూవున్నట్లయితే, అతను ఖచ్చితంగా విజయాన్ని సాధిస్తాడు. ఆ విజయాన్ని ఏ ఒక్కరూ అడ్డుకునేందుకు కుదరదు.

## ఎందుకు తగాదా?



ఒక జెన్ సాధువు ఉన్నాడు. గొప్ప మేధావి అయినప్పటికీ, అతను యాచకం చేస్తూనే తన ఆకలిని తీర్చుకోవడాన్ని అలవాటుగా చేసుకున్నాడు. ఒకరోజు ఆవిధంగా ఒక గ్రామంలోని ఒక ధనవంతుని ఇంటిముందు భిక్ష వేయమంటూ అభ్యర్థించాడు. ఆ ధనవంతునికి ఈ జెన్ సాధువు యొక్క శక్తిని గురించి తెలుసు. అతను జెన్ సాధువు ముందుకొచ్చి, అణకువతో నమస్కరించి, ఆయనకు భోజనం ఏర్పాటు చేశాడు.

ఆ తరువాత జెన్ సాధువును ''స్వామీ! మనుషులు ఎందుకు పోట్లాడుకుంటుంటారు? ప్రశాంతమైన జీవితం సాధ్యం కాదా?''అని ప్రశ్నించాడు. అందుకు సదరు జెన్ సాధువు, ''మీ దగ్గర భోజనం యాచించేందుకే ఇక్కడకు వచ్చాను. మీ ప్రశ్నలకు జవాబులను చెప్పేందుకు రాలేదు''అంటూ బదులిచ్చాడు. ఆ ధనవంతుడు కోపంతో రగిలిపోయాడు. ''ఇదేం పద్ధతి? భోజనం పెట్టిన నాతోనే ఇలా మాట్లాడటం తగునా? మిమ్మల్ని గొప్ప మేధావి అంటూ చెబుతున్నారే?''అంటూ మొదలుపెట్టి పరుషపదజాలంతో తిట్లదండకాన్ని వడ్డించాడు.

మొదటి వ్యక్తి ఆ బండరాయిని మోసుకుని వెళ్ళాడు. రెండవ వ్యక్తి సందిగ్ధతతో, ''అయ్యా, ఇన్ని రాళ్ళను ఏవిధంగా తీసుకున్నచోటనే పెట్టేందుకు కుదురుతుంది?''అని అడిగాడు.

ఆ సాధువు నవ్వుతూ రెండవ వ్యక్తితో ఈవిధంగా చెప్పాడు. ''అతను పెద్ద పాపం చేశాడు. అందుకు తగినవిధంగా పరిహారం చెల్లించి, దానినుంచి బయటపడేందుకు కుదురుతుంది. నువ్వేమో లెక్కకు మిక్కిలిగా చిన్న చిన్న పాపాలను చేస్తూ, అవి పాపాలనే విషయాన్ని కూడ గ్రహించలేదు. నీ వలన ఎవరు బాధింపుకు లోనయ్యారనే విషయం కూడ నీకు తెలియడం లేదు. ఆ చిన్న పాపాల ప్రభావంతో ఆ పాపాల ఫలితాన్ని నువ్వు అనుభవించక తప్పదు.''

పాపాలలో చిన్న పాపం... పెద్ద పాపం...అంటూ లేవు. పాపం అనేది పాపమే. ఆ విషయాన్ని గ్రహించి సరిదిద్దుకోవాలి.



కొన్ని నిముషాలపాటు అతని తిట్లదండకాన్ని ప్రశాంతంగా భరించిన జెన్ సాధువు, ''మీకు నచ్చని ఒక జవాబును చెప్పినప్పుడు, మీరు కోపంతో రగిలిపోతున్నారు. దారుణముగా తిడుతున్నారు. నేనూ, మీలాగే తిట్లదండకాన్ని మొదలుపెట్టినట్లయితే, పెద్ద తగాదా మొదలయ్యేది. అన్ని తగాదాలకు కోపమే ప్రధాన కారణం. కోపాన్ని వదిలేస్తే, ప్రశాంతమైన జీవితం సుసాధ్యం. ఈ విషయాన్ని మీకు అవగతం చేసేందుకే ఆ విధంగా మాట్లాడాను''అని చెప్పి వెళ్ళిపోయాడు.

చిన్న చిన్న విషయాలకు కోపగించుకుంటూ పెద్ద పెద్ద తగాదాలను మొదలుపెడుతున్నాము. కొన్ని నిముషాలపాటు కోపాన్ని వదిలేస్తే, పలు సంవత్సరాలపాటు మానసిక ప్రశాంతత లభిస్తుంటుంది.



## జీవితంలో తప్పుకోలేని నియమాలు!

- మీరు మంచి చేసినప్పటికీ, చెడు చేసినప్పటికీ, మనుషులు మీ గురించి రకరకాలుగా మాట్లాడుతుండటాన్ని అడ్డుకునేందుకు కుదరదు.
- అది మంచి పరిస్థితో, చెడు పరిస్థితో, ఈ పరిస్థితి ఖచ్చితంగా మారుతుందని నమ్మండి.
- మంచివాళ్ళే ఎక్కువ కష్టాలు పడుతున్నట్లుగా కనబడుతుంటుంది. కారణం, మంచివాళ్ళే మనఃసాక్షి యొక్క ప్రశ్నలకు భయపడుతుంటారు. అందువల్లనే కష్టాలను ఎదుర్కొని, తదనంతరం వాటి నుంచి బయటపడుతుంటారు.
- కుటుంబ జీవితంలో ఉద్యోగ / వ్యాపార / పారిశ్రామిక జీవితంలో సమస్థితిని పాటించడం తెలిసినవారికి, ఈ జీవితం ఆనందమయంగా ఉంటుంది.
- 'వీరు లేకుండా నా జీవితం లేదు' అంటూ ఏ ఒక్కరిని గురించి భావించవద్దు. జీవితం, దాని యొక్క మార్గంలో అన్నింటినీ మార్చేస్తుంటుంది.
- జీవితంలో ఎదురుపడుతుండే అన్ని సమస్యలకు ఏదో ఒక పరిష్కారం తప్పకుండా ఉంటుంది.
- మీపట్ల ఇతరులకు ఉన్న నమ్మకాన్ని, ఇతరులకు ఇచ్చిన వాగ్దానాన్ని కాపాడండి. రహస్యాలను రహస్యముగానే ఉంచండి. ప్రశాంతమైన జీవితం మీ సొంతం.
- తాత్కాలికమైన ఈ ప్రపంచములో పేరుప్రఖ్యాతులు, ఐశ్వర్యం అంటూ అన్నీ తాత్కాలికమైనవే. ఈ విషయాన్ని, అన్నింటినీ పూర్తిగా కోల్పోయిన తదనంతరమే పలువురు అవగతం చేసుకుంటున్నారు.

# చిట్టిపొట్టి చిన్నారులకు చరవాణి వరమా అదొక శాపమా?

అన్నం తినేందుకు మంకుపట్టు పడుతుండే చిన్నారులకు చరవాణిలో కార్టూన్ వీడియోను చూపిస్తూ అన్నం తినిపిస్తుంటారు తల్లులు. చిన్నారి ఏడుస్తున్నప్పుడల్లా తన చేతుల్లో చరవాణి పరికరాన్ని పెట్టి, ఏదో ఒక వీడియోను చూపిస్తూ సమాధానపరుస్తుంటారు తల్లిదండ్రులు. పిల్లలు కాస్తంత ఎదిగిన తరువాత, తమకు చరవాణి పరికరం కావాలంటూ ఏడుస్తున్నప్పుడే అసలు సమస్య మొదలవుతుంటుంది.

''నా సెల్‌ఫోన్‌ను ఎందుకు తీసుకున్నావు? అక్కడే పెట్టు''అని గదమాయించడం, ''ఎప్పుడు చూసినా ఆ సెల్‌ఫోన్‌లో ఏమిటి ఆటలు?''అని బెదిరించడం పిల్లలను బాధిస్తుంటుంది. పిల్లలకు సంబంధించినంతవరకు చరవాణికి తగిన నియంత్రణలు ఏమిటనే విషయం తెలియక తల్లిదండ్రులు సందిగ్ధతకు లోనవుతుంటారు.

చిన్నారులకు చరవాణి పరికరాన్ని ఇవ్వనేకూడదు. చరవాణి యొక్క ధగధగ మెరుస్తుండే తెరను (స్క్రీన్) చూసే స్థాయికి పిల్లల నేత్రాలలో అభివృద్ధి పరిపూర్ణముగా జరిగివుండదు. దూరముగా ఉంటుండే దృశ్యశ్రవణ యంత్రాన్ని కొన్ని నిముషాలపాటు చూడవచ్చు. కానీ ముఖానికి దగ్గరగా పెట్టుకుని చరవాణి పరికరాన్ని చిన్నారులు చూడకూడదు.

పెరుగుతోన్న చిన్నారులకు చరవాణిలో కార్టూన్ పాత్రలను పరిచయం చేయడంకంటే, నిజజీవితంలో కొంతమందిని పరిచయం చేయడం ఉత్తమం. కార్టూన్ పాత్రలు వారితో సంభాషించడం లేదు. వాటి వచనాలను పిల్లలు మౌనంగా వినాల్సిన పరిస్థితులు. తత్ఫలితముగా పిల్లల యొక్క సంభాషణ ప్రతిభ, సమాజంతో కలగలసిపోతుండే లక్షణం, ఆలోచించే ప్రతిభ బలహీనపడుతుంటాయి. తోటి మనుషులతో మాట్లాడటం, బయట ప్రదేశాలకు వెళ్ళడం అనేవి వారికి వివిధ రకాలైన అనుభవాలను అందిస్తుంటాయి. సదరు అనుభవాల ద్వారా, తమ మనస్సులలో తలెత్తుతుండే సందేహాలను, వారు ప్రశ్నల రూపంలో సంధిస్తుంటారు. అందుకు తల్లిదండ్రులు, ఇతరులు చెప్పే జవాబులే వారి తెలివితేటలను పెంచుతుంటాయి.

చిన్నారులకు చరవాణి పరికరాన్ని అందించకుండా, తల్లిదండ్రులు, ఇతరులు అందులోనే మునిగిపోతుండటం మంచి పద్ధతి కాదు. చిన్నారి, అమ్మానాన్నలు తనతో అప్పుడప్పుడు మాట్లాడాలని ఎదురుచూడటం జరుగుతుంటుంది. ఆ సమయంలో తల్లిదండ్రులు చరవాణులలో, వాట్సప్‌లోనో, ఇన్‌స్టాగ్రామ్‌లోనో మునిగిపోయి వున్నట్లయితే, చరవాణి పరికరంలోనే జీవితపు ఆనందం ఉంటుందని సదరు చిన్నారి భావించడం జరుగుతుంటుంది. తను, ఆ చరవాణి పరికరాన్ని లాక్కునేందుకు ప్రయత్నించడం జరుగుతుంటుంది. చిన్నారులు మేల్కొనివున్న సమయంలో వారితో మాట్లాడండి. వారు, పసిప్రాయంలో ఎక్కువసేపు నిద్రపోతుంటారు. అప్పుడు తల్లిదండ్రులు చరవాణి పరికరాన్ని ఉపయోగించుకోవచ్చు.

పెరిగేకొలదీ పిల్లలకు చరవాణి పరికరానికి సంబంధించిన సాంకేతికత అర్థమవుతుంటుంది. చరవాణి ద్వారా పెద్దలకంటే అత్యంత వేగంగా పిల్లలే అన్నింటినీ నేర్చుకుంటున్నారు. మీ చరవాణి పరికరం ఎంతటి నవీనమైనది అయినప్పటికీ, అందులో కనీసం 10 ఆప్షన్స్‌కు పైగా ఉపయోగించాలని మీరు ఏమాత్రము ఆలోచించి వుండరు. మీ పిల్లలు మాత్రము మీకంటే అప్‌డేటెడ్. అధికపక్షం 80 శాతం మీ చరవాణి పరికరంలోని పలువిధాలైన యాప్స్‌ను





ఉపయోగిస్తూ మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంటారు. ఎందుకంటే, వారు స్మార్ట్‌ఫోన్ జన్మించిన ఈ తరానికి చెందినవారు.

ప్రస్తుతకాలంలో బాల్యప్రాయంలోనే ఆన్‌లైన్ తరగతులు సహజమై పోయాయి. చేయవలసిన హోంవర్క్, ప్రాజెక్ట్స్ అంటూ పలు విషయాలను వాట్సప్ ద్వారా పంపించే పరిస్థితి మొదలయ్యింది. ఒకేసారి వాళ్ళ చేతులకు చరవాణి పరికరాన్ని అందించకుండా పెంచాలనుకుంటే ప్రస్తుతకాలంలో అది సాధ్యం కాదు. ఆవిధంగా చేసినట్లయితే, తోటి పిల్లలకంటే వారు సాంకేతిక పరిజ్ఞానంలో వెనుకబడి పోతుంటారు. ఆత్మన్యూనతాభావానికి లోనవుతుంటారు.

అయితే చరవాణిని ఉపయోగించడంలో కొన్ని కొన్ని సమస్యలు ఉన్నాయి. పాఠశాల విద్యార్థినీవిద్యార్థులు చదువుకునేందుకు ఉపయోగిస్తుండే చరవాణి, ల్యాప్‌టాప్ మరియు కంప్యూటర్ మొదలైన వాటిలోనున్న సామాజిక మాధ్యమాలు వారిని పాజిటివ్‌గా, నెగెటివ్‌గా బాధిస్తుంటాయి. పలువురు విద్యార్థినీవిద్యార్థులు సామాజిక మాధ్యమాలకు బానిసలైపోయి, వాటిలోనే మునిగిపోతుంటారు.

భయంకరమైన ఆటలను నమ్ముతూ ప్రాణాలను వదిలేయడం, ఆడుకునేందుకు తల్లి యొక్క బ్యాంకు ఖాతాను ఖాళీ చేయడం, ముఖపుస్తకం స్నేహబంధంతో తననే కోల్పోవడం అంటూ వీరి యొక్క ఆటలు సైబర్ క్రైమ్‌తో ముగుస్తున్నాయి. సామాజిక మాధ్యమాలను ఉపయోగించడంలోనున్న సాధక బాధకాలను అవగతం చేసుకుని, వారిని సరైన మార్గంలో నడిపించాలి.

ఆరోగ్యవంతమైన మార్పులకోసం ఉపయోగిస్తున్నంతవరకు సామాజిక మాధ్యమాలు ఒక వరమే. ఆన్‌లైన్ గేమ్‌లను నేర్చుకునే పిల్లలు, వాటికి బానిసలుగా మారిపోవడం ప్రమాదకరం. ఆన్‌లైన్ గేమ్‌లు వారిని బానిసలుగా మార్చేయడం వలన వారి యొక్క ఆలోచనలు విభిన్నంగా ఉంటుంటాయి. వారు, తమ కాలాన్ని పూర్తిగా కోల్పోవడంతోపాటు, ఒకేచోట గంటల తరబడి కూర్చుని, శరీరానికి ఎటువంటి వ్యాయామం లేకపోవడం వలన శారీరక బరువు విపరీతముగా పెరుగుతుంటుంది. యువప్రాయానికి చేరినవారు ముఖపుస్తకం సంభాషణల ద్వారా ముక్కూముఖం తెలియని వ్యక్తులతో పరిచయాలను పెంచుకుని, ఏమాత్రం అవగాహన లేకుండా కొన్ని తప్పుడు మార్గాలలో పయనించడం జరుగుతోంది.

అదేసమయంలో సామాజిక మాధ్యమాలలో కొన్ని మంచి విషయాలు కూడ ఉన్నాయి. ఆన్‌లైన్ తరగతులలో అర్థంగాని పాఠాలను యూట్యూబ్‌లో వేరే ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను చూస్తూ విద్యార్థినీవిద్యార్థులు నేర్చుకుంటున్నారు. కొత్తగా నేర్చుకునే పరిస్థితులలో ఎన్నో పాఠాలు అందులో ఉన్నాయి. ఈవిధంగా సామాజిక మాధ్యమాలలో పాజిటివ్ విషయాలు ఎన్నెన్నో ఉన్నప్పటికీ, పిల్లలకు హద్దులను ఏర్పాటు చేయడమనేది తల్లిదండ్రుల బాధ్యత. తల్లిదండ్రులు పిల్లలకు రోల్‌మోడల్స్‌గా ఉండేందుకు ప్రయత్నించాలి. అందుకు తగినవిధంగా ప్రవర్తిస్తుండాలి. ఆ విషయంలో ఏమాత్రం అశ్రద్ధ తగదు.

- చరవాణిని ఉపయోగించడంలో కొంత సమయాన్ని పాటించడం, పిల్లలతో మాట్లాడుతున్నప్పుడు చరవాణికి 'నో' చెప్పడం, కొన్ని పనులను చేస్తున్నప్పుడు సైలెంట్ మోడ్‌లో పెట్టడాన్ని కుటుంబమే పాటిస్తుండాలి.
- వారికి ఇష్టమైన వేరే ఆటలను నేర్పించడం, తోటపని, యోగ, టైమ్ మేనేజ్‌మెంట్ అంటూ వారికి అలవాటు చేయడం సామాజిక మాధ్యమాలకు చెందిన పాజిటివ్ మోడ్‌కు మార్చుతుంటుంది.
- పిల్లల ఆన్‌స్క్రీన్ సమయాన్ని తగ్గించేందుకు, ఆటలు, శారీరక వ్యాయామం మరియు నృత్యం అంటూ వారికి ఇష్టమైన వాటిలో సమయాన్ని గడిపేవిధంగా పిల్లలకు అలవాటు చేయాలి.
- చరవాణిలో వస్తుండే అబద్ధపు మెసేజ్‌లను ఏవిధంగా తొలగించాలనే విషయాన్ని నేర్పించాలి. బ్యాంకులు పంపిస్తుండే అలెర్ట్ మెసేజ్‌లను గురించి తగిన అవగాహనను కల్పించాలి.
- సామాజిక మాధ్యమాలలో వస్తుండే ప్రకటనలలో చూపించే ఆహారపదార్థాలలో ఆరోగ్యవంతమైనవాటిని అనుమతించాలి. డబ్బులను ఏవిధంగా వృథా ఖర్చు చేయకూడదనే విషయాన్ని ఉదాహరణలతో నేర్పించాలి. తమ స్నేహబృందం ఎదుర్కొన్న మోసాలను పిల్లలకు వివరించి చెప్పాలి.
- వారు ఆశించే రంగాలలో ఏమేమి చేయవచ్చు, ఎటువంటి పనులను చేయవచ్చనే విషయాన్ని పిల్లలతోపాటు పెద్దలు కూడ అన్వేషించాలి.
- పిల్లల వయస్సుకు తగినవిధంగా ఏవిధమైన సైబర్‌క్రైమ్‌లు జరుగుతుంటాయనే విషయానికి సంబంధించి ఎవరైనా బలవంతపెడుతున్నప్పుడు, తప్పుడు సమాచారాన్ని పంపిస్తున్నట్లయితే, తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పాలి. ఎటువంటి క్లిష్టపరిస్థితుల నుంచైనా తల్లిదండ్రులు తమను రక్షించుతారనే నమ్మకం పిల్లల మనస్సులలో బలపడేవిధంగా చేయాలి.
- మీ పిల్లలు విజయశిఖరాలను చేరుకునేందుకు సామాజిక మాధ్యమాలు ఒక ఉపకరణంగా ఉండాలి. ●



# మరలా లభిస్తుంది!

ఒక ప్రమాదంలో విపరీతమైన గాయాలకు లోనైన ఒక వ్యక్తిని, చాలా ప్రమాదకరమైన స్థితిలో ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అతని కుటుంబం ఆర్థికపరంగా దిగువస్థాయికి చెందినప్పటికీ, సమీపంలో నున్న ప్రముఖ ఆసుపత్రి కావడం వలన సదరు ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. న్యాయమైన ఫీజుతో అత్యుత్తమమైన సేవలను అందిం చేదిగా సదరు ఆసుపత్రి పేరుప్రఖ్యాతులను పొందింది.

అతనికి వెంటనే శస్త్రచికిత్స చేయాలి. ఆసుపత్రి యజమాని యైన ప్రధాన వైద్యుడే శస్త్రచికిత్సను చేస్తాడని చెప్పబడింది. కాబట్టి, ఎంత ఖర్చు అవుతుందోనని కుటుంబసభ్యులు ఆందోళనాభరితులై పోయారు. వారికి ఏం చేయాలో తెలియలేదు.

ఆ రోగిని లోపలకు తీసుకుని వస్తున్నప్పుడే యథేచ్ఛగా ప్రధాన వైద్యుడు అతని ముఖాన్ని చూశాడు. అదిరిపడ్డాడు. వెంటనే అతడిని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్ళి శస్త్రచికిత్సను విజయవంతంగా ముగించాడు. ''ఈయనను జాగ్రత్తగా చూసుకోండి. ఈయన కుటుంబ సభ్యుల దగ్గర ఇప్పుడు దేనికోసం డబ్బులను అడుగవద్దు''అని చెప్పి వెళ్ళాడు. ఆసుపత్రి సిబ్బంది ఆయన చెప్పినట్లుగానే, ఎటు వంటి సందర్భాలలోనైనా వారిని దగ్గర డబ్బులను గురించి ఏ మాత్రం ప్రస్తావించలేదు.

నాలుగైదు రోజులలో ఆయన ఒకవిధముగా కోలుకోవడంతో స్పెషల్ వార్డుకు మార్చబడ్డాడు. ఎందుకు తమను ఆసుపత్రి యాజ మాన్యం డబ్బులు అడగటం లేదని కుటుంబ సభ్యులు సందిగ్ధతకు లోనయ్యారు. ఆయన భార్య, ఒక పరిచారికతో ఈ విషయాన్ని గురించి ప్రస్తావించగా, ''ఒకవేళ చివరగా మొత్తముగా వసూలు చేస్తారనుకుంటా!''అంటూ సదరు పరిచారిక చెప్పింది. తనకు చేసిన చికిత్స కోసం ఎంత ఫీజు అని అతను అడిగాడు. సుమారు ఐదు లక్షలకుపైగా అవుతుందని లెక్కలు చెప్పారు. ప్రమాదంలో అను భవించిన గాయాల నొప్పికంటే, ఆ విషయం అతడిని ఎంతగానో బాధించింది.

ప్రధానవైద్యుడు ప్రతిరోజూ వచ్చి, అతడిని పరీక్షిస్తుంటాడు. మందులు, భోజనం అంటూ అన్నింటినీ ఏర్పాటు చేస్తుంటాడు. డబ్బులకు ఏం చేయాలనుకుంటూ, సదరు పేషెంట్, అతని భార్య కలత చెందసాగారు. ఎవరెవరిని అప్పు అడుగుదామనే విషయాన్ని గురించి ఆలోచించసాగారు. ఇంటిని అమ్మేద్దామా, లేకపోతే తాకట్టు పెడదామా అని ఆలోచించసాగారు.

రెండువారాల తదనంతరం పేషెంట్‌ను, అతని భార్యను తన గదికి పిలిపించిన ప్రధానవైద్యుడు, చికిత్సకు చెందిన బిల్లును అందించాడు. ఆ బిల్లులో ఐదు లక్షల రూపాయలు అని ముద్రించ బడిన మొత్తంపై అడ్డంగా గీత గీసి, ''దేవుని ఖాతా నుంచి డబ్బులు చెల్లించబడ్డాయి''అని చెప్పాడు సదరు ప్రధాన వైద్యుడు.

దేవుని ఖాతా అంటే ఏమిటనే విషయం ఆ కుటుంబ సభ్యులకు ఏమాత్రం అర్థం కాలేదు.

సందిగ్ధతతో పేషంట్ ఆ ప్రధానవైద్యునివైపు చూడగా, ''బ్రదర్, నన్ను గుర్తుపట్టారా?''అని సదరు ప్రధానవైద్యుడు ప్రశ్నించాడు. అందుకు పేషెంట్ ''ఎక్కడో చూసినట్లుగా ఉంది. అయితే ఎక్కడ అనే విషయం గుర్తుకు రావడం లేదు''అని చెప్పాడు.

వెంటనే ఆ ప్రధానవైద్యుడు ఆ సంఘటనను వివరించాడు. ''పది సంవత్సరాలకు ముందు, నేను కుటుంబంతోపాటు విహార యాత్రకు వెళ్ళాను. అటవీమార్గంలో గభాల్న కారు చెడిపోయింది. జనసంచారం లేని రహదారి. చరవాణి సిగ్నల్ లభించలేదు. సాయం చేసేందుకు ఏ ఒక్కరూ లేరు. చీకటి మొదలయ్యింది. క్రూరమృగాలు నడయాడే ప్రదేశంలో ఏమవుతుందోనని పిల్లలు బిగ్గరగా ఏడ్వడం మొదలుపెట్టారు. గందరగోళమైన పరిస్థితి.

కాసేపటి తరువాత మీరు ఆ మార్గములో ద్విచక్రవాహనంపై వచ్చారు. మేము పిలువకుండానే మా దగ్గరకు వచ్చి, ద్విచక్ర వాహనాన్ని నిలిపి 'సమస్య ఏమిటి?'అని అడిగారు. 'నేను కారు మెకానిక్‌నే. దీనిని సరిచేస్తాను'అంటూ ధైర్యవచనాలను చెప్పి, కారు ముందుభాగాన్ని తెరిచి చూసారు. ద్విచక్రవాహనం హెడ్‌లైట్ వెలుగులో కారును కొన్ని నిముషాలలో బాగు చేశారు. కారు స్టార్ట్ అయ్యింది. మా సమస్యకు పరిష్కారం లభించింది.

ఆ కారడవిలో, ఆ సమయంలో ఆ దేవుడే మిమ్మల్ని పంపించాడని అనుకుంటున్నాను. ఆ పరిస్థితులలో మీరు చేసిన పనికి, మీరు ఎంత డబ్బును అడిగినా ఇచ్చివుండేవాడిని. అయితే, మీరు డబ్బులను తీసుకోలేదు. 'సమస్యలలోనున్నవారికి సాయం చేస్తున్నప్పుడు నేను డబ్బులను తీసుకోను. ఈ పనిని ఆ దేవుడు నా ఖాతాలో పెడతాడు'అంటూ చేతులను జోడించి, నమస్కరిస్తూ వెళ్ళిపోయారు. అప్పుడు మాకు దేవుని ఖాతా గురించి తెలియదు.

ఆరోజు మేము సంతోషానందాలతో, ప్రశాంతముగా ఇంటికి చేరుకున్నాము. ఆ సమయములో మీరు చెప్పిన మాటలు నన్ను ఆలోచింపజేశాయి. 'సాధారణస్థితిలోనున్న ఒక వ్యక్తే ఇటువంటి ఒక పద్ధతిని పాటించేందుకు కుదురుతున్నప్పుడు, మనం కూడ దీనిని పాటిస్తే మంచిదేగా?'అని ఆలోచించాను.

అప్పటివరకు ఒక ఆసుపత్రిలో పని చేసిన నేను, దేవుని ఖాతా పట్ల నమ్మకంతో సొంతగా ఈ ఆసుపత్రిని ప్రారంభించాను. న్యాయమైన ఫీజును తీసుకుంటున్నాను. దానికి మించి నాకు అక్కర్లేదు. వసతిసౌకర్యాలు కలిగినవారు అడగకుండానే ఇస్తుంటారు. పేదలను ఫీజుకోసం బలవంతపెట్టడంలేదు. నిజం చెప్పాలంటే, నేను గతంలోకంటే ఎక్కువగా సంపాయిస్తున్నాను.

మిమ్మల్ని కలుసుకోవాలని ఎక్కడెక్కడో వెదికాను. కనిపెట్టలేకపోయాను. ఇటువంటి విపత్కరమైన పరిస్థితులలో మిమ్మల్ని కలుస్తానని అనుకోలేదు. మీ నియమాల ప్రకారం, నేను మీ నుంచి ఫీజును తీసుకోకూడదు. దేవుని ఖాతా నుంచి దానిని సరిచేసుకున్నాను. మీరు ఇక్కడకు వచ్చిన సంగతిని మా కుటుంబసభ్యులకు కూడ తెలియజేశాను''అంటూ ఆ ప్రధానవైద్యుడు చెప్పి ముగించగా, వెనుక గదిలోనుంచి ఆ వైద్యుని భార్యాబిడ్డలు వచ్చి, ఆ పేషెంట్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

ఆ పేషెంట్ చేతులను జోడించి, వైద్యుని గదిలోనున్న దేవుళ్ళ చిత్రపటాలవైపు చూస్తూ మొక్కుతూ, ఆనందభాష్పాలతో సంతోషానందభరితుడైపోయాడు.

మనం చేసే పనులు మనకే తిరిగి వస్తుంటాయి. ఇందుకు తగిన ఉదాహరణగా ఇంకొక సంఘటన.

రైల్లో ఒక వయోవృద్ధురాలు మామిడిపండ్లను విక్రయించ సాగింది. రుచికరమైన బంగినపల్లి మామిడిపండ్ల వాసన రైలుపెట్టె అంతటా వ్యాపించింది. బాగా పండిన మామిడిపండ్లు అన్నీ ఒకే సైజులో ఉన్నాయి. 'ఒక పండు 50 రూపాయలు'అంటూ వయోవృద్ధురాలు చెప్పగా, ఒకతను ఎటువంటి బేరం చేయకుండా నాలుగు పండ్లను 200 రూపాయలకు కొనుక్కున్నాడు. కాసేపటి తరువాత అతని దగ్గరకు వచ్చిన వయోవృద్ధురాలు ''అయ్యా, ఈ పండును తీసుకోండి''అంటూ ఒక మామిడిపండును ఇచ్చింది.

అతను ''నేను, నా డబ్బులకు తగిన పండ్లను తీసుకున్నాను కదా అవ్వా?''అని అన్నాడు. ''అవును, మీరు ముందుగా డబ్బులు



ఇచ్చారు''అని ఆమె చెప్పడంతో అతను సందిగ్ధతకు లోనయ్యాడు. ఆ తదనంతరం సదరు వయోవృద్ధురాలు, ''మీరు ఎటువంటి బేరం చేయకుండా తీసుకున్నారు. కానీ, ప్రక్కపెట్టెలోనున్నవారు బేరమాడి ఒక పండును 40 రూపాయలకు తీసుకున్నారు. మీకు అధికమైన ధరకు అమ్మడం తప్పు నాయనా, నా అంతరాత్మ వినదు. అందుకే నా లెక్కను సరిచేసుకునేందుకు మీకు ఈ పండును ఇస్తున్నాను''అని చెప్పింది.

మనకోసమైనది ఎలాగైనా మనకు తిరిగి లభిస్తుంటుంది. ●

# పాఠశాలలో నేర్చుకోవలసిన నీతినియమాలు!

పాఠశాల ప్రాయంలో పిల్లలు అమితంగా ఇష్టపడుతుండేది క్రీడాసమయం, నీతిబోధన కథల సమయంగా ఉంటుంటాయి. ఆటలాడుకునే సమయములో తరగతి గదిలో ఎదురయ్యే ఒత్తిళ్ళ నుంచి బయటపడి, క్రీడామైదానములో ఆడుతూ పాడుతూ వుందామనే స్వతంత్ర భావన పిల్లలకు ఎంతగానో నచ్చుతుంటుంది. నీతిబోధనలలో చెప్పబడుతుండే కథలు, ఆ యా కథలు అవగతం చేస్తుండే నీతినియమాలు పిల్లలకు అమితంగా నచ్చుతుంటాయి. ఆవిధంగా చెప్పబడుతుండే నీతి పాఠాలకు సంబంధించి పరీక్షలు అనేవి లేకపోవడం కూడ పిల్లలు అమితంగా ఇష్టపడటానికి వెనుక నున్న ప్రధానమైన కారణం.

నిజానికి నీతిబోధన తరగతి పాఠాలకు పాఠశాలలో పరీక్షలనేవి ఉండవు. ఎందుకంటే జీవితపర్యంతం మన జీవితం అనేక పరీక్షలను పెడుతూనేవుంటుంది. అటువంటి పరీక్షలకు చెందిన జవాబులు, పాఠశాలలో నేర్చుకునే నీతిబోధనలలో ఉంటుంటాయి.

సదరు నీతిబోధన పాఠాలను తగ్గించకుండా క్రింద సూచించ బడిన పద్ధతులను పిల్లల మనస్సులలో బలపరుచవచ్చు...

◆ **ఎల్లలు లేని ఆప్యాయతానురాగాలు :** ప్రతిఫలాన్ని ఎదురుచూస్తూ కురిపించే ఆప్యాయతానురాగాలు స్వార్థపూరితం. ఎటువంటి నిబంధనలు లేకుండా కురిపించే ప్రేమాభిమానాలే నిజమైనవి. అందరూ ఆప్యాయతానురాగాలను పంచుతున్నప్పుడు ఈ ప్రపంచమే కరుణామయంగా మారిపోతుంటుంది. అన్ని విధాలైన వ్యథలు తొలగిపోతుంటాయి. విద్వేషం లేకుండా ప్రేమాభిమానాలను పంచుతూ, సంతోషానందాలను, విజయాన్ని అందుకునే పద్ధతులను పిల్లలకు బోధించాలి.


◆ ఏ ఒక్కరినీ మోసగించకుండా, ఎటువంటి తప్పులు చేయకుండా, నిజాయితీగా జీవించడాన్ని చిన్నారులకు అలవాటు చేయాలి. చిన్న చిన్న విషయాలకు లేనిపోని అబద్ధాలు మాట్లాడకుండా నిజాయితీగా ప్రవర్తించడం వలన లభించే ఫలితాలను గురించి అవగతం చేయాలి.

◆ వేగవంతమైన ఈ ప్రపంచములో ఇతరులను అణగద్రొక్కుతూ పైకెదగడాన్ని పలువురు చేస్తున్నారు. ఆవిధంగా ఒకరిని అణగద్రొక్కి మనం అందుకునేది విజయం కాదనే విషయాన్ని పిల్లలకు అవగతం చేయాలి. డబ్బు, అంతస్తు, జీవనశైలి అంటూ ఏ ఒక్క విషయానికి సంబంధించి ఏ ఒక్కరినీ అవమానపరుచకూడదు. అందరినీ గౌరవమర్యాదలతో చూసేవిధముగా పిల్లలకు తగిన బోధన చేయాలి.

◆ విడివిడిగా ప్రయత్నించడం కంటే, సమిష్టిగా కలగలసిపోయి విజయాన్ని పొందడం వలన లభించే ఫలితాలను గురించి పిల్లలకు అవగతం చేయాలి. తోటివారితో పట్టువిడుపులతో ప్రవర్తిస్తూ, భుజాలను తడుతూ అందుకునే విజయాలు అత్యున్నతమైనవనే విషయాన్ని పిల్లలు తెలుసుకోవాలి. ఆ విషయమే సమాజంలో చక్కగా కలగలసిపోయే పద్ధతులను పిల్లలకు అవగతం చేస్తుంటుంది. ఫలితంగా పిల్లల జీవితాలు ఆనందంగా ఉంటుంటాయి.


◆ అభిప్రాయభేదాలను, తగాదాలను పెద్దలకంటే పిల్లలే త్వరితంగా మరచిపోతుంటారు. కోపావేశాలతో ఇతరులు కురిపించే తిట్లదండకాలను పిల్లలు తేలిగ్గా మరచిపోతుంటారు. సదరు వ్యక్తులను క్షమిస్తుంటారు. ఇలాంటి లక్షణాన్ని వదిలేయకుండా, మనస్సులలో పదిలపరుచుకునే విధముగా పిల్లలకు అలవాటు చేయాలి. తద్వారా వారికి మంచి చేసినట్లవుతుంది.

◆ ఎదుటివారి సమస్యలను అర్థం చేసుకుని, వారు పెరుగుతుండాలి. ఆకలి, అప్పు, రోగాలు అంటూ అనేకమైన సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటారు. వారి యొక్క పరిస్థితిని అర్థం చేసుకుని, కరుణతో ప్రవర్తించే లక్షణాన్ని పిల్లలకు ఆ వయస్సులోనే అలవాటు చేయాలి. పాఠశాలలో పిల్లలకు అటువంటి బోధనలు చేసినట్లయితే, ఈ సమాజానికి శ్రద్ధాభక్తులతో తగిన సాయాలు చేస్తుండే అనేకమంది లభిస్తుంటారు. ●




RAMRAJ
mrithu
TOWELS
SOFT LIKE
Foam
MRITHU PREMIUM
BATH TOWELS
BAMBOO TOWELS
SIGNATURE TOWELS
TERRY TOWELS
STRIPED & CHECKERED
TOWELS
SUPER SOFT & SUPER ABSORBENT
Available at Ramraj Showrooms and All Leading Textile Shops


RAMRAJ
CULTURE CLUB®
MATCHING DHOTIS • SHIRTS
TIMELESS
DRAPES
TRENDSETTING
SHADES


RAMRAJ
ACHARYA®
PANCHAKACHAM DHOTIS
True Spiritual
Strength Reflected
In Simplicity


Kokhila®
WOMEN'S INNERWEARS
BY
RAMRAJ

మీ ఇంటికే రావలెనా?
రావాలనుకుంటున్నారా?

# తేటతెలుపు

## చందాదారులుగా మారిపోండి!



'ఉన్నతమైన భావనలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపించాలి' అనే గొప్ప లక్ష్యంతో అత్యంత విలువైన వ్యాసాలను వరుసక్రమంలో ప్రచురిస్తోంది తేటతెలుపు. ఈ మాసపత్రిక ప్రతి ఒక్క కుటుంబంలో భద్రంగా పెట్టుకునే బొక్కెసంలాగ విరాజిల్లుతోంది.

**ఒక సంవత్సర చందా రూ.200**
**రెండు సంవత్సరాల చందా రూ.380**

చెక్కు/డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపించవచ్చు **VENMAII** అనే పేరిట చెక్కు/డి.డి పంపించవచ్చు. వెనుక మీ పేరు, చిరునామాను వ్రాయండి.

లేక

VENMAII అనే బ్యాంకు ఖాతాకు (A/C No : 1809135000000299, Karur Vysya Bank, Tirupur SR Nagar Branch - IFSC : KVBL0001809) డబ్బును చెల్లించి, దాని యొక్క నకలు ప్రతిని ఫారంతో పాటు పంపించాలి.

- మనియార్డర్లు స్వీకరించబడవు.
- రామ్‌రాజ్ షోరూములన్నింటిలో మీ చందాలను చెల్లించవచ్చు.


**VENMAII**
10, Sengunthapuram, Mangalam Road, Tirupur-641604.
email: venmaii@ramrajcotton.net


**చందాలను చెల్లించేందుకు, తేటతెలుపు పత్రికలను మొత్తంగా కొనుక్కునేందుకు సంప్రదించండి :**
**ఫోన్ :**
**0421–4304106, 98422 74137**

## ఒకే నిముషంలో తేటతెలుపు చందాదారులుగా మారిపోవచ్చు!

మీ చందాను PhonePe G Pay
Net transfer ద్వారా చెల్లించండి.

UPI పరివర్తన ద్వారా మొబైల్ ఫోన్ ద్వారా వెన్‌మై బ్యాంకు ఖాతాకు చందా మొత్తాన్ని చెల్లించవచ్చు. వెన్‌మై UPI id: kvbupiqr.75626@ kvb

Bharat QR code సౌకర్యము ఉన్న మొబైల్ బ్యాంకింగ్ యాప్ ఉన్నవారు, అందులో ఇక్కడ ఉన్న వెన్‌మై బ్యాంక్ ఖాతా QR code - ను స్కేన్ చేసి చందా చెల్లించవచ్చు.

డబ్బు చెల్లించినందుకుగాను బ్యాంకు సమాచారాన్ని Forward చేయండి. దానితోపాటూ మీ యొక్క పూర్తి చిరునామాను, మీ చరవాణి ద్వారా వాట్సాప్ చేయండి. చరవాణి సంఖ్య : 98422 74137

**బ్యాంకు ఖాతా వివరాలు : Venmaii**
**A/C No: 1809135000000299**
**Karur Vysya Bank,Tirupur SR Nagar Branch**
**IFSC Code: KVBL0001809.**

## విద్యార్థి/విద్యార్థినులకు ప్రత్యేక తగ్గింపు



(6 వ తరగతికి పైగా చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఈ తగ్గింపు అందించబడుతోంది. చందాను చెల్లిస్తున్నప్పుడు విద్యార్థినీవిద్యార్థుల గుర్తింపు అట్ట యొక్క నకలు ప్రతిని జతచేసి పంపించాలి).

| ఒక సంవత్సర చందా : | రెండు సంవత్సరాల చందా : |
|---|---|
| రూ. ~~200~~ రూ.125 మాత్రమే. | రూ. ~~380~~ రూ.250 మాత్రమే. |

## సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక తగ్గింపు



(60 యేళ్ళు పైబడినవారికి ఈ తగ్గింపు అందించబడుతోంది. పుట్టినతేదికి సంబంధించిన తగిన ఆధారంతో కూడిన నకలు ప్రతిని జత చేసి పంపించాలి).

| ఒక సంవత్సర చందా : | రెండు సంవత్సరాల చందా : |
|---|---|
| రూ. ~~200~~ రూ.125 మాత్రమే. | రూ. ~~380~~ రూ.250 మాత్రమే. |

రామ్‌రాజ్ షోరూములలో రూ.10,000 లకు పైగా దుస్తులను కొనుక్కునేవారికి
**ఒక సంవత్సర చందా బహుమతిగా అందించబడుతుంది.**

# చేయూతను ఇవ్వడమే ఉన్నతమైన నాగరికత!



మనిషి నిప్పును గురించి తెలుసుకున్నప్పుడు, నాగరికత విలసిల్లింది... ఇనుమును ఉపయోగించడాన్ని నేర్చుకున్నప్పుడు నాగరికత అభివృద్ధి చెందింది... చక్రాన్ని తయారుచేసినప్పుడు మనుషులు వేగాతివేగంగా పయనించేందుకు కుదిరింది. కాబట్టి అప్పుడే నాగరికత అభివృద్ధి చెందినదని చారిత్రక సంఘటనలు వివరిస్తుంటాయి. మానవ నాగరికత వయస్సును కొన్ని లక్షల సంవత్సరాల ముందుకు వారు తీసుకెళుతుంటారు.

అయితే మార్గరెట్ మీడ్ అనే ప్రముఖ మానవశాస్త్రవేత్త, ఈ అభిప్రాయానికి విభిన్నంగా ''మానవ నాగరికత 15 వేల సంవత్సరాలకు ముందు మాత్రమే మొదలైంది''అని చెప్పడం జరిగింది.

''మానవశాస్త్రం, ఆదిమ మానవుల జీవితాలు, నాగరికతను గురించి తెలుసుకునేందుకు అందుకు సంబంధించిన సమాచారం, పురాతన సామగ్రి తప్పకుండా ఉండాలి. ఆ విషయాలను సామాజిక శాస్త్రం ద్వారా తెలుసుకోవచ్చు. అయితే, దానికంటే ముందు 'మానవ నాగరికత అంటే ఏమిటి?'అనే విషయాన్ని భావోద్వేగపరముగా మనం అవగతం చేసుకోవాలి''అని చెబుతోంది మార్గరెట్ మీడ్.

ఆమె ఒక సంభవాన్ని సూచిస్తూ, మానవ నాగరికతను భావోద్వేగపరంగా అవగతం చేసుకునేవిధంగా చెప్పడం జరిగింది. ''15 వేల సంవత్సరాలకు ముందు జీవించిన ఒక మనిషి యొక్క అస్థిపంజరం మాకు లభించింది. ఇతర అస్థిపంజరాలకు, ఆ అస్థిపంజరానికి మధ్య తేడా ఏమిటో తెలుసా? సదరు అస్థిపంజరానికి చెందిన మనిషి యొక్క తొడ ఎముక విరిగిపోయి, కొంతకాలంలో సరైన పిదప, మరలా అతను వేటాడుతూ సహజమైన జీవితాన్ని జీవిస్తూ తుదిశ్వాస విడిచాడు. ఇదే మేము కనిపెట్టిన విభిన్నత''అని చెప్పింది మార్గరెట్ మీడ్.

దీనిని చదువుతున్నవారికి సందిగ్ధంగా అనిపించవచ్చు. ''ఒక మనిషి తొడ ఎముకలు విరిగిపోయి, మరలా సహజంగా జీవించడానికీ, నాగరికతకు ఎటువంటి సంబంధం ఉంది?''అనే ప్రశ్న తలెత్తవచ్చు.


అందుకు మార్గరెట్ మీడ్ యొక్క వివరణ, ''మనిషి కూడ ఒక జంతువే. ఇతర జంతువులను ఆకలి ఏవిధంగా సజీవంగా ఉండే విధంగా చేస్తుంటుందో, అదేవిధంగా మనిషిని కూడ చేస్తుంటుంది. జింకలమందలో ఒక జింకను సింహం పట్టుకుంటే, మిగతా జింకలు బెదిరిపోయి పరుగులు పెడతాయి. ఆ జింకను కాపాడేందుకు రావు. వేటాడేందుకు ఒక మనుషుల గుంపు వెళుతోంది. అక్కడ తోడేళ్ళ మంద వెంటాడితే, ఒక్కొక్కరూ విడివిడిగా పరుగులు పెడుతూ తప్పించుకునేందుకు ప్రయత్నిస్తారు తప్ప, తోటి మానవులను కాపాడాలని భావించరు. కారణం, అప్పుడు మనిషి జంతు లక్షణాలను కలిగి వున్నాడు. తోటివారిని కాపాడాలనే భావనే ఉండేది కాదు. ఈవిధంగా మనిషి కొన్ని లక్షల సంవత్సరాలపాటు జీవితాన్ని కొనసాగించాడు.

అటువంటి జీవనశైలిలో, ఒక మనిషి తొడ ఎముక విరిగిపోయినట్లయితే, అతని జీవితమే ముగిసిపోయినట్లుగా అనుకోవచ్చు. అతడిని అలాగే వదిలేసి ఆది మానవులు వెళ్ళిపోతూ ఉంటారు. వాళ్ళకు సంబంధించినంతవరకు అదొక తప్పు కాదు. అటువంటి పరిస్థితులలో ఒక మనిషి తొడ ఎముక విరిగి, సరైనట్లయితే, ఒకరు లేక పలువురు కలసి అతడిని ఒక గుహలో భద్రంగా చూసుకుని వుండవచ్చు. రోజూ అతనికి తగిన ఆహారాన్ని వేటాడి తీసుకొచ్చి అందించి వుండ వచ్చు. అతని యొక్క దినచర్యలలో తగిన సాయాన్ని చేసివుండవచ్చు. అతడిని ఆప్యాయతా నురాగాలతో నిద్రింపజేసివుండవచ్చు. నొప్పితో అవస్థలు పడుతున్నప్పుడు అతడిని ఓదార్చి వుండొచ్చు. ఇవన్నీ చేసినందువలననే ఆ మనిషి మరలా ఆరోగ్యవంతంగా వేటాడేందుకు కుదురు తుంది. అతను మరలా వేటాడేస్థాయికి చేరడం వెనుక ఇటువంటి సాయాలు తోటి మనుషులు చేసివుండొచ్చు. అదే నాగరికతకు చిహ్నం.

ఒక మనిషి స్వార్థచింతన లేకుండా, ఇంకొక మనిషి క్షేమం పట్ల శ్రద్ధ చూపిస్తున్నప్పుడే అక్కడ నాగరికత ఫరిడవిల్లిందని భావించవచ్చు. చక్రాన్ని తయారుచేయడమో, నిప్పును రగిలించడాన్ని కనిపెట్టడమో వంటివి మాత్రమే నాగరికత కాదు. ఒక మనిషి తొడ ఎముక విరిగి, అతను అవస్థలు పడుతున్నప్పుడు, ఇతరులు తగినంత శ్రద్ధాభక్తు లతో అతనికి సేవలు చేస్తున్నారే...అటువంటి సందర్భాలలోనే ప్రప్రథమంగా మానవ నాగరికత అనేది మొదలయ్యింది'' అని క్లుప్తంగా వివరి స్తోంది మార్గరెట్ మీడ్.

తోటివారికి సాయపడుతుండటమే మానవ నాగరికత యొక్క ఆరంభం. మనుషులమైన మనందరం ఎదుటివారికి సాధ్యమైనంతమేరకు సాయాన్ని చేయాలి. ఆ పద్ధతిని పిల్లలకు బాల్య ప్రాయం నుంచే అలవాటు చేయాలి. తెలిసిన వారికి సాయపడుతుండటం మాత్రమే కాదు, దైనందిన జీవితంలో మనం చూస్తుండే ముక్కూ ముఖం తెలియని వ్యక్తులకు కూడ మనకు సాధ్య మైనంత మేరకు సాయపడుతుండటమనేది నాగ రిక మనిషి యొక్క పద్ధతి. ●

# గౌరవం మనఃపూర్వకంగా వస్తుంది!



ఒక పెద్దాయనను ధనవంతుని ఇంటి విందుకు ఆహ్వానించారు. ఆయన చేతికర్రను పట్టుకుని ఆ ఇంటికి చేరుకున్నాడు. ఆ ఇంట్లోకి ప్రవేశిస్తున్నప్పుడు, తన చేతి కర్రను తలక్రిందులుగా త్రిప్పి నడవసాగాడు. ఫలితంగా ఆయన మామూలుగా నడవ లేకపోయాడు. నడిచేందుకు కాస్తంత కష్టపడవలసివచ్చింది.

విందుకు వచ్చిన పలువురు ఆయనవైపు చూస్తూ హేళనగా నవ్వసాగారు. ఆ పెద్దాయన కూడ నవ్వుతూ, ''ఇంట్లో నేలకు చాలా చక్కని టైల్స్‌ను బిగించారు. నేను రోడ్డుపై చేతికర్రను పట్టుకుని వస్తున్నప్పుడు, కర్రకు క్రిందిభాగంలో అంటుకున్న మురికి, ఈ టైల్స్‌ను మురికిగా చేయకూడదనే, నేను నా చేతికర్రను తిప్పి పట్టుకున్నాను'' అని చెప్పాడు. ఆయనను హేళనగా భావించినవారందరూ సిగ్గుతో తలదించుకున్నారు.

ఆ పెద్దాయనలాగ జీవితంలో గౌరవమర్యాదలను అందుకునేందుకు ఎప్పుడూ పాటించవలసిన కొన్ని విషయాలు :

- గుంపుగా అందరూ పాటిస్తుండే ఏ ఒక్క విషయాన్నీ కళ్ళుమూసుకుని పాటిం చడం తగదు. పెద్ద పెద్ద గుంపులు ఎప్పుడూ ప్రశ్నించకుండా ఎవరెవరినో అను సరిస్తుంటారు.
- ఎక్కువమంది వెళ్ళని మార్గంలో పయనించడం ఉత్తమం. అయితే 'ఇతరులు ఎందుకు ఈ మార్గంలో రావడం లేదు?' అనే విషయాన్ని గ్రహించి, పయనాన్ని మొదలుపెట్టాలి.
- జీవితం అనేది ఎన్నో కుట్లు, చిరుగులతో కూడిన దుప్పటి వంటిది. కాబట్టి దానిని జాగ్రత్తగా ఉపయోగించాలి.
- ఎవరినైనా విమర్శించేందుకు ముందు బాగా ఆలోచించాలి. ఒకరిని గురించిన అభిప్రాయాన్ని చెప్పేందుకు ముందు బాగా పరిశీలించండి. మీరు ఏది చేసినప్ప టికీ, అది ఎన్నో వంతులుగా మీకు తిరిగి అందుతుంటుంది.
- మిమ్మల్ని దాటుకుని వెళ్తుండేవారందరికీ మీ జీవితంలో స్థానం ఉన్నదనే విషయాన్ని ఒక పాఠంలాగ నేర్చుకోండి.
- ఇవాళ్టి మీ యొక్క నిర్ణయాలకు భవిష్యత్తులో చెల్లించవలసిన ధర ఎంత అనేదే మీరు లెక్కించవలసిన అత్యంత ముఖ్యమైన లెక్క.

ఒక కార్యాలయంలో పని చేస్తుండే ఒక యువకుడు కొత్తగా ఒక ఐఫోన్‌ను కొన్నాడు. 70 వేల రూపాయల ఐఫోన్. సమస్య ఏమిటంటే అతను, తన మేజాబల్లపైనే ఐఫోన్‌ను పెట్టి కార్యాలయ మంతటా తిరుగుతూ అందరితో మాట్లాడుతుంటాడు. కొన్ని కొన్ని సార్లు ఐఫోన్‌లో మాట్లాడుతూనే ఇతరుల ముందుకు వెళుతుంటాడు. అక్కడ కాసేపు కూర్చుని మాట్లాడి, ఐఫోన్‌ను అక్కడే వదిలేస్తుం టాడు. ఆ సంగతే పట్టించుకోడు.

''ఏమండీ, ఐఫోన్‌ను తీసుకెళ్ళండి'' అంటూ ఆ బెంచీముందు కూర్చున్న వ్యక్తి చెప్పినట్లయితే, ''నా ఐఫోన్ ఎక్కడికి పోతుంది? ఆఫీసులో ఎవరు దానిని తీసుకుంటారు?'' అని అంటుంటాడు. ఒక రోజు కార్యనిర్వాహకుడు హితబోధ చేశాడు. ''ఇది కనబడకుండా పోయినట్లయితే, మీరు వెదుకుతుండే వేగంతో అందరినీ సందేహిం చడం జరుగుతుంటుంది. ఐఫోన్ కనబడకుండాపోయినట్లయితే, అది మీ యొక్క సమస్య మాత్రమే కాదు, అది అందరి సమస్యగా మారిపోతుంటుంది'' అంటూ హెచ్చరించాడు. ఆ యువకుడు కార్య నిర్వాహకునివైపు చూస్తూ, ''మీరు లేనిపోనివిధంగా ఊహిస్తున్నారు'' అని చెప్పి, హేళనగా ఒక నవ్వు నవ్వి వెళ్ళాడు.




కొన్నివారాల తరువాత ఆ యువకుడి ఐఫోన్ కనిపించకుండా పోయింది. ఆందోళనతో, ''చూశారా...చూశారా...'' అంటూ అందరినీ అడుగసాగాడు. అతడు అందరినీ అనుమానిస్తుండటంతో, కార్యా లయంలోని ఉద్యోగులందరూ ఇబ్బందిగా భావించారు. చివరగా చూస్తే, అతను తన ఐఫోన్‌ను ఇంట్లోనే పెట్టి మరచిపోయి కార్యా లయానికి వచ్చాడని తెలిసింది.

ఇప్పుడు కూడ కార్యనిర్వాహకుడు హితబోధ చేశాడు. ''కొన్ని వస్తువులను, ఆ యా వస్తువుల యజమానులే భద్రంగా పెట్టుకో వడమనేది, వారికి మాత్రమే మంచిది కాదు; అందరికీ మంచిది''

లీలాకృష్ణ వ్రాసిన కథానిక 'మెల్లగా మెట్లు ఎక్కుతూ'లో ఇటు వంటి సంఘటనే చెప్పబడుతుంది. సుశీల అనే 30 యేళ్ళ మహిళ, తన ఐదేళ్ళ చిన్నారితో ముంబయి నుంచి చెన్నైకి వస్తుంది. చెన్నైలో తన బాబాయి కూతురు పెళ్ళి. సుశీల కూతురు పప్పి హుషారుగా పరుగులు పెడుతూవుండగా, తన చురుకుదనాన్ని చూసినవాళ్ళం దరూ మెచ్చుకోసాగారు.

వివాహవేడుక ఇంట్లోనే చాలా చక్కగా జరిగింది. ఎక్కువమంది అతిథులు రావడంవలన, ఆ రోజు రాత్రి మిద్దెపై చాపలను, దుప్పట్లను పరిచి, పిల్లలను వరుసగా పడుకోబెట్టి నిద్రపుచ్చారు. మహిళలు ఇంట్లోనే పడుకోగా, పురుషులు వీధిలోనున్న కొన్ని ఇళ్ళముందు ఉన్న అరుగులపై పడుకున్నారు.

అర్ధరాత్రిపూట గభాల్న మెలకువ వచ్చిన సుశీలకు భయంగా అనిపించింది. 'మా పాప పప్పీ మిద్దెపైన పడుకునివుంటుందే? తన మెడలో మూడు సవర్ల బంగారు గొలుసు ఉందే? ఒకవేళ మిద్దెపైన పిల్లలకు తోడుగా పడుకునివున్న వయోవృద్ధుడైన పనిమనిషి మారి స్వామి దానిని దొంగిలిస్తే?!''

వెంటనే మిద్దెపైకి వెళ్లి, తన కూతురు మెడభాగాన్ని పరిశీలించా లని పైకి లేచింది. సుశీల లేవడాన్ని చూసిన ఆమె మేనత్త, ''ఏదైనా సమస్యా?'' అని ప్రశ్నించగా, సుశీల విషయాన్ని వివరించింది. ''భయ పడకమ్మా, అలా గ జరుగదు. మారిస్వామి చాలా మంచివాడు'' అంటూ సుశీలను సమాధానపరిచేందుకు ప్రయత్నించింది. అయినప్పటికీ సుశీల మనస్సులో ఆందోళన.

చివరకు సదరు మేనత్త, ''నేనే వెళ్ళి చూసొస్తాను'' అని చెప్పి, అవస్థలు పడుతూ మెట్లు ఎక్కి, మిద్దెపైకి చేరుకుని, అక్కడ ఎలాగో పప్పీని కనిపెట్టి, ఆ బాలిక మెడను తాకి చూసింది. గొలుసు లేదు. ''అయ్యో! గొలుసు లేదే?'' అని మేనత్త ఆందోళన చెందుతుండగా, ''ఎవరది?'' అంటూ పనిమనిషి మారిస్వామి టార్చ్‌లైట్ వెలిగించగా, మేనత్త - మారిస్వామి ఒకరినొకరు చూసుకున్నారు.

మారిస్వామిని ''గొలుసు ఎక్కడ?'' అని మేనత్త ప్రశ్నించగా, ''మీరే కదా ఆ చిన్నారి మెడను తాకారు. మీరు చెప్పండి. గొలుసు ఎక్కడ?'' అంటూ అతను ఎదురుప్రశ్నను సంధించాడు. ఇద్దరూ తగాదాపడ్డారు.

ఆ గొడవను విన్నవాళ్ళందరూ హడావిడిగా అక్కడకు చేరుకున్నారు. మారిస్వామిని పరీక్షించారు. అతని దగ్గర గొలుసు లేదు. ఆలోపు సుశీలను, ఆమె తల్లి ఒక ప్రక్కకు పిలుచుకుని వెళ్ళింది. ''సుశీ, మీ మేనత్త చాలా కష్టాలలో ఉంది. ఆమె కూతురుని అత్తింటివారు తరిమివేశారు. అల్లుడు, తన భార్యకు మూడు సవర్ల బంగారపు గొలుసును ఇస్తేనే, ఇంటికి తీసుకెళతానని చెప్పాడట. కాబట్టి మీ మేనత్త కూడ గొలుసును దొంగిలించివుండొచ్చు. తనను శోధిస్తే, అది మన కుటుంబానికే అవమానం. కాబట్టి వదిలెయ్'' అని చెప్పింది.



వెనువెంటనే సుశీల అందరిముందుకు వచ్చి, ''ఈ సమస్యను ఇంతటితో వదిలేద్దాం. గొలుసు పోతే పోనిద్దాములే'' అని చెప్పడముతో, మేనత్త దయనీయముగా ''నేను తీసుకోలేదమ్మా. నువ్వు నన్నేమైనా సందేహిస్తున్నావా?'' అని అడిగింది.

ప్రాతఃకాలాన్నే నిద్ర లేచిన తరువాత సుశీ, తన కూతురు పప్పీని పిలిచి మెల్లగా బంగారపు గొలుసు గురించి అడిగింది. ''మమ్మీ, నేను గొలుసు తీసి, నగల పెట్టెలో పెట్టి, మన సూట్ కేసులో పెట్టాను. రాత్రిపూట నగలతో నిద్రపోవచ్చా?'' అంటూ ఆ చిన్నారి చాలా సాధారణంగా ప్రశ్నించింది. సుశీలకు ఆశ్చర్యం. గొలుసు దొరికిందనే మానసిక ప్రశాంతత. అయితే, మారిస్వామిని, మేనత్తను సందేహించామే అని అనుకుంటూ సుశీల వేదన చెందింది.

'పది సంవత్సరాలకుపైగా ఇక్కడ పని చేస్తున్నాను. మనలను సందేహించారే?'' అనుకుంటూ మారిస్వామి వేదనలో మునిగిపోయాడు. 'తోబుట్టువు కూతురు, నన్ను సందేహించిందే?' అనుకుంటూ మేనత్త వేదన. 'నాన్నగారి చెల్లెలు, మను మరాలి నగను దొంగిలించి వుంటుందా?' అంటూ సుశీల వేదన. విలువైన వస్తువును శ్రద్ధగా పట్టించకోకపోవడం వలన ఎంతమందికి మనోవేదన? ఖరీదైన వస్తువులను ఎక్కడైనా పెట్టి, ఆత్మీయులను కష్టపెట్టకూడదు.

# అణకువతో ఉండండి!



- చెట్లు కూడ నిండుగా కాయలతో ఉన్నప్పుడు, తలలు వంచుకునే ఉంటుంటాయి. ఎంత గొప్పగా సంపాయించినప్పటికీ అణకువతో ఉండండి.
- అందం అనేది రూపంలో లేదు. మన ప్రవర్తనలో, పనులలో, మన హృదయం నుంచి వెలువడుతుండే దయలో ఉంటుంది.
- గతకాలంలాగానే భవిష్యత్తుకాలం ఖచ్చితంగా ఉండదు. మన పనులే మన యొక్క భవిష్యత్తును మంచిగానో, చెడుగానో మార్చేస్తుంటాయి.
- కొన్ని పనులను గురించి 'ఇది మనవల్ల కాదు' అని భావిస్తుంటాము. ఆ పని మనకు ఇష్టము లేనప్పుడే అటువంటి భావన తలెత్తుతుంటుంది. అయితే మనం ఇష్టపడినట్లయితే, అది మన వల్ల కుదురుతుంది.
- కొన్ని విషయాలను తలుచుకుంటూ భయపడుతున్నందువలన మనం పిరికివాళ్ళం కాదు. అందరూ ఏదో ఒక విషయానికి సంబంధించి భయపడటం సహజం. భయం అవమానం కాదు.
- జీవితంలో కొందరిని కోల్పోయినందుకు వేదన చెందవద్దు. వారి కంటే ఉత్తములు. మీరు ప్రయత్నిస్తే మీకు తోడుగా దొరుకుతారు. వారి తోడు మీకు ప్రశాంతతను అందిస్తుంటుంది.
- అవకాశం దొరికినప్పుడు వదులుకోవద్దు. కొన్ని కొన్ని సమయాలలో రెండవ అవకాశం దొరక్కపోవచ్చు.
- దయ, కృతజ్ఞత భావన పలు కష్టాలనుండి మిమ్మల్ని కాపాడుతుంటుంది. అందరికీ, అన్ని విషయాలలో కృతజ్ఞత భావనతో ఉండండి. బంధాలు బలపడుతుంటాయి.



రాచపుండు (క్యాన్సర్) వ్యాధిగ్రస్తులకు అత్యుత్తమమైన చికిత్సలను అందించే ప్రముఖ ఆసుపత్రి. అక్కడున్న వైద్యులు అత్యుత్తమ చికిత్సలను అందిస్తుంటారు. సదరు ఆసుపత్రిలోని పనివాళ్ళు రోగులను జాగ్రత్తగా చూసుకుంటుంటారు. తత్ఫలితంగా రోగుల ఆత్మవిశ్వాసం బలపడుతుంటుంది. దీర్ఘకాలపు చికిత్స అయినందువలన రోగులు ఎక్కువకాలముపాటు ఆసుపత్రిలోనే ఉండాల్సిన పరిస్థితి.

వారిలో పలువురికి ఒకే ఒక సమస్య, ఆహారం! రాచపుండుకు కీమోథెరపి చికిత్స చేస్తున్నప్పుడు నోరు చాలా చేదుగా అనిపిస్తుంటుంది. అప్పుడప్పుడు డోకు వచ్చినట్లుగా అనిపిస్తుంటుంది. అందువలన సరిగ్గా తినలేక అవస్థలు పడుతుంటారు. ఆసుపత్రి అందిస్తోన్న భోజనంలో రుచికంటే ఆరోగ్యానికే ప్రాధాన్యతను కల్పిస్తుంటారు. అందువలన రోగపీడితులకు సదరు ఆహారం ఏమంతగా నచ్చదు.

పిల్లల వార్డులో వంటలు చేయిస్తుండే షీలా ఈ విషయములో అధికమైన శ్రద్ధాభక్తులను పాటిస్తుంటుంది. రోగం నుంచి బయటపడటమనేది ఆహారంతోనే మొదలవుతుంటుందనేది ఆమె నమ్మకం. ఒక్కొక్క చిన్నారికి అందించే ఆహారపు పళ్ళెం ఖాళీగా తిరిగి రావాలని ఆమె భావిస్తుంటుంది. ఎవరైనా సరిగ్గా తినకుండా పళ్ళేన్ని తిప్పి పంపించినట్లయితే, వెంటనే ఆ చిన్నారి దగ్గరకెళ్ళి సమస్యను అడిగి తెలుసుకుంటుంది.

ఎనిమిదేళ్ళ కిరణ్, అక్కడకు వచ్చిన మొదటిరోజే సరిగ్గా తినలేదు. కీమోథెరపి చికిత్స వలన నోరు చేదుగా ఉంటోందని ఏడుస్తూనే వున్నాడు. కొంచెం బిస్కెట్‌ను మాత్రం తిన్నాడు. షీలా పంపించిన భోజనం, అలాగే తిరిగి వచ్చింది. వెంటనే షీలా ఆ బాలుడి దగ్గరకెళ్ళి సంభాషించింది. ''ఎందుకు అన్నం తినలేదు? నువ్వు దేనిని ఇష్టంగా తింటావు?''అంటూ ప్రశ్నించకుండా, ఆ బాలునితో సరదాగా కాసేపు మాట్లాడింది. తరువాత ''నీకు జ్వరం వచ్చినప్పుడు ఏమి తింటావు?''అని అడిగింది. అందుకు కిరణ్, ''మా అవ్వ బియ్యపు గంజిని చేసి, నంజుకోవడానికి ఏదో పచ్చడిని ఇస్తుంది. భలే రుచిగా ఉంటుంది''అని చెప్పాడు.

వెంటనే నల్లేరు పచ్చడిని తయారుచేసి, గంజితో కలిపి, దానిని కిరణ్‌కు ఇవ్వమని చెప్పింది. కొన్ని నిముషాలలో గంజికప్పు ఖాళీ అయినది. వెంటనే కిరణ్ వచ్చి ''మా అవ్వలాగానే మీరు కూడ చక్కగా గంజిని చేశారు''అని షీలాతో చెప్పి వెళ్ళాడు. షీలా ఆ బాలుడిని గారాబంగా బుజ్జగించింది.ఆ తదనంతర రోజులలో ఆ బాలుడికి ఏమేమి ఇష్టమో తెలుసుకుని, వాటిని వండి అందించసాగింది.

తను ఏమంతగా భోజనం చేయలేని స్థితిలో ఉన్నరోజులలో కూడ కిరణ్ కొంచెమైనా తినసాగాడు. మందులతోపాటు ఆహారం కూడ అతనికి బలాన్ని అందించడంతో, త్వరితంగా రాచపుండు సమస్య నుంచి బయటపడ్డాడు.

ఆరోగ్యవంతునిగా ఇంటికి బయలుదేరినరోజు, కిరణ్, షీలాను చాలా అందంగా చిత్రీకరించి, ఆ చిత్రాన్ని ఆమెకు బహుమతిగా అందించి వెళ్ళిపోయాడు. ఎవరో ఒక చిన్నారి ఆహారాన్ని తినకుండా పళ్ళేన్ని తిరిగి ఇచ్చినట్లయితే, షీలా ఆ చిత్రంవైపు చూస్తుంది. వెంటనే వెళ్ళి ఆ చిన్నారికి ఇష్టమైన పదార్థాన్ని అడిగి తెలుసుకుంటుంది.

పెద్ద పెద్ద యంత్రాలు, చికిత్స పరికరాలు, మందులున్న ఆ ప్రదేశములో ఒక్కొక్క చిన్నారి యొక్క ఆహారాన్ని గురించి శ్రద్ధ వహించిన ఒకరున్నారనేది షీలా ప్రత్యేకత.

ఒక పాఠశాలలో ఏడుకొండలు ఉద్యోగ విధులను నిర్వహించసాగాడు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు అవసరమైన సేవలను చేయడం, ప్రధానోపాధ్యాయునికి సహాయకునిగా ఉండటం, కార్యాలయ పనులను చక్కబెట్టడం, విద్యార్థినీవిద్యార్థులను గమనించడం అంటూ అన్నివిధాలైన పనులను చేస్తుంటాడు. అతను పదవీ విరమణ పొందే సమయం వచ్చింది.

సాధారణ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్నప్పుడు అధ్యాపకులందరూ డబ్బులను అందించి, ఒక బహుమతిని ఇస్తూ, ఒక కార్యక్రమాన్ని నిర్వహించి వీడ్కోలు ప్రసంగాలతో పొగడటం సహజం. అయితే, ఏడుకొండలకు ఆవిధంగా చేయడానికి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఇష్టపడలేదు. 'అతను ఒక సాధారణ ఉద్యోగే కదా! అతడిని ప్రధానోపాధ్యాయుని గదికి పిలిచి, ఒక శాలువాను కప్పి, పంపించుదాం'అనే నిర్ణయాన్ని తీసుకున్నారు. ఆ ప్రయత్నాలు చేయసాగారు.

# ఇతరులు చూడనివాటిని చూసినవారు!



ఆరోజు సాయంత్రం పాత విద్యార్థులు పలువురు పాఠశాలకు రావడం మొదలు పెట్టారు. నూరుమందికి పైగా పూర్వవిద్యార్థినీవిద్యార్థులు రావడంతో అధ్యాపకులకు సందిగ్ధంగా అనిపించింది. ఏడుకొండలు పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొనేం దుకు వచ్చినట్లుగా వాళ్ళందరూ చెప్పారు. ఒక్కొక్కరూ ఏడుకొండలుతో కరచాలనం చేస్తూ సంతోషంగా మాట్లాడసాగారు. ఇప్పటివరకు తన పదవీ విరమణ గురించి పెద్దగా పట్టించుకోని ఏడుకొండలు, ఇప్పుడు కన్నీటిపర్యంతమైపోయాడు.

''నేను క్రీడామైదానంలో దెబ్బలు తగిలి కిందపడిపోయినప్పుడు, నన్ను తన భుజాలపై మోసుకుంటూ ఆసుపత్రికి తీసుకెళ్ళాడు. మా కుటుంబానికి ఆసుపత్రి ఫీజును చెల్లించేందుకు కూడ డబ్బులు లేవు. ఆయనే ఆసుపత్రి ఫీజును చెల్లించి, నన్ను కాపాడాడు''అంటూ ఒక పూర్వవిద్యార్థి చెప్పాడు.

''నేను లెక్కల్లో ఫెయిల్ అవడం వలన మా క్లాస్ టీచర్ తరగతికి బయట నన్ను గుంజిళ్ళు తీయించాడు.ఆ దృశ్యాన్ని చూసిన ఈ మాస్టారుగారు, నాకు రోజూ సాయంత్రంపూట లెక్కలను చెప్పి, లెక్కల పరీక్షలో నేను మంచి మార్కులను పొందేవిధంగా చేశారు. నా లాగానే పలువురు మాస్టారుగారి దగ్గరే చదువు కున్నారు''అని వివరించాడు ఇంకొక పూర్వవిద్యార్థి. ఏడుకొండలు ఏదో చెబుతుంటాడనే విషయం ఉపా ధ్యాయినీ ఉపాధ్యాయులకు తెలుసు. అయితే తను లెక్కల్లో ఇంతటి ప్రతిభావంతుడనే విషయం ఎవ్వ రికీ తెలియదు.

ఉదయాన్నే భోజనం చేయకుండా పాఠశాలకు వచ్చిన విద్యార్థినీవిద్యార్థులకు రోజూ అన్నం పెట్టడం, బహుదూరం నుంచి పాఠశాలకు వస్తోన్న విద్యార్థి నికి ఎవరినో అభ్యర్థించి సైకిల్‌ను కొనిచ్చినది, తండ్రి మరణం వలన పాఠశాలకు రాకుండా నిలిచిపోయిన విద్యార్థి ఇంటికి వెళ్ళి స్వాంతన వచనాలను పలికి, ఆ విద్యార్థిని పాఠశాలకు పిలుచుకుని వచ్చిన విషయం అంటూ ఒక్కొక్కరూ చెప్పేందుకు సంతోషకరమైన విషయాలు ఎన్నెన్నో ఉన్నాయి. ఆ పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయినీ - ఉపాధ్యా యులకు కృతజ్ఞతలను తెలియజేసేందుకు ఇంత మంది విద్యార్థినీవిద్యార్థులు తరలిరాలేదు. వాళ్ళం దరూ కలసి ఒక పెద్ద మొత్తాన్ని ఏడుకొండలుకి కాను కగా అందించారు. అయితే ఏడుకొండలు ఆ మొత్తాన్ని కూడ పాఠశాలకే విరాళంగా అందించాడు.

ప్రధానోపాధ్యాయుడు ఆరోజు పాఠశాల క్రీడా మైదానంలో బ్రహ్మాండమైన వీడ్కోలు మహాసభను ఏర్పాటు చేయవలసివచ్చింది. ''మేమందరం తర గతి గదిలో మాత్రమే విద్యార్థినీవిద్యార్థులను గమ నిస్తుంటాము. తరగతి గదికి బయట మేము గమ నించని వారి యొక్క సమస్యలను ఏడుకొండలు తెలుసుకోవడం జరిగింది. ఇకపైన మేము కూడ ఆ విధంగా గమనించాలనే విషయాన్ని ఏడుకొండలు మాకొక పాఠంలాగ బోధించాడు. ఏడుకొండలు ఎప్పటిలాగానే పాఠశాలకు వస్తూ పిల్లలకు సేవలను అందించాలి. తనకు పదవీ విరమణ అనేది లేదు. ఆయన పాఠశాలకు అందించిన విరాళంతోపాటు మేము కూడ కొంత మొత్తమును చేర్చి, ఆయనకే కానుకగా అందించబోతున్నాము''అంటూ ప్రధానో పాధ్యాయుడు తన ప్రసంగాన్ని ముగించగా, ఆ సభా ప్రాంగణం కరతాళధ్వనులతో మారుమ్రోగింది. ఆ ప్రాంగణం సంతోషానందాలతో నిండిపోయింది. ●

# చిట్టిపొట్టి చిన్నారులకు నైతిక విలువలను బోధించండి!



నేటి తరానికి చెందిన పిల్లలు పెద్దలకంటే అధికమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగివుంటున్నారు. అది వారి ఊహలలో వ్యక్త మవుతోంది. ఒక చిన్నారికి, తన అవ్వ నీతికథను బోధించింది. దాహంతో అల్లాడిపోయిన కాకి, ఒక కుండలో రాళ్ళను వేస్తూ నీళ్ళు పైకి వచ్చేవిధంగా చేసి, నీళ్ళను త్రాగిన కథ. వెంటనే ఆ చిన్నారి ఆ కథను ఈవిధంగా మార్చేయడం జరిగింది. 'కుండలో నీళ్ళు అడుగుభాగములో ఉన్నాయట. కాబట్టి ఆ నీళ్ళను త్రాగేందుకు కుదరదని కాకికి అర్థమైపోయింది. వెంటనే ఆ కాకి గూగుల్ మ్యాప్‌లో చూసింది. ఆ మ్యాప్, ప్రక్కనే చాలా దగ్గరగా ఒక కొలను ఉన్నట్లుగా చూపించింది. వెంటనే ఆ కాకి ఎగురుకుంటూ ఆ కొలను దగ్గరకు చేరుకుని, నీళ్ళను త్రాగి, దాహాన్ని తీర్చుకుంది.' ఈవిధమైన ఊహను తన మనుమరాలి నుంచి ఎదురుచూడని సదరు అవ్వ నోరెళ్ల బెట్టింది. నేటి ఆధునిక తరం యొక్క విభిన్నమైన ఆలోచన.

ఇంకొక నీతి కథ. ద్రాక్షతోటకు వెళ్ళిన నక్క, ఆశగా ద్రాక్షపండ్లను తినేందుకు ప్రయత్నించింది. ద్రాక్షపండ్లు ఎత్తుగా ఉండటంతో దానికి అందలేదు. ఎగురుతూ ద్రాక్షపండ్లను అందుకోవాలని ప్రయత్నించి ఓడిపోయిన నక్క, 'ఛీ... ఈ పండ్లు పుల్లగా ఉంటాయి' అని గొణుక్కుంటూ ముందుకు కదిలింది అంటూ కథ ముగిసింది. ఆ కథను విన్న ఒక చిన్నారి, 'ద్రాక్షపండ్లు అందకపోవడంతో, వెంటనే ఆ నక్క సెల్‌ఫోన్‌ను తీసుకుంది. ఆహారాన్ని డెలివరీ చేసే యాప్ ద్వారా ఒక కిలో ద్రాక్షపండ్లకు ఆర్డర్ చేసింది. పావుగంటలో డెలివరీబాయ్ వచ్చి ద్రాక్షపండ్లను ఇచ్చి వెళ్ళాడు. ఆ నక్క చాలా సంతోషముగా తీయనైన ద్రాక్షపండ్లను తినింది' అంటూ ముగించడం జరిగింది.

**పిల్లలకు నైతిక విలువలను బోధించినట్లయితే, వారి యొక్క ఆలోచనలు కూడ నీతిమంతంగానే ఉంటుంటాయి. పిల్లలకు ఎటువంటి నైతిక విలువలను బోధించాలి?**

- పిల్లల పెరుగుదలలో కుటుంబం ప్రధాన పాత్ర వహిస్తుం టుంది. ఎన్నిసమస్యలు ఎదురైనప్పటికీ, ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఒకరికొకరు పంచుకుంటుండే ప్రేమాభిమానాలను, ఆప్యాయతాను రాగాలను పిల్లలకు అవగతం చేయాలి. అదేవిధమైన భావోద్వేగాన్ని వారి మనస్సులలో బలపరుస్తుండాలి.
- పెద్దలు, స్నేహితులు, ఇంట్లో పనులను చేస్తుండేవారు, తమ తోపాటు ఆడుతుంటుండే తోటిపిల్లలు అందరినీ మర్యాదగా చూడాలి. తల్లిదండ్రులను, ఎదుటివారిని చూస్తూనే పిల్లలు మర్యాదగా ప్రవ ర్తించడాన్ని అలవాటు చేసుకుంటుంటారు. సరైన రోల్‌మోడల్స్‌ను వారికి పరిచయం చేయాలి.
- సమస్యలు, సవాళ్ళు ఎదురైనప్పుడు పట్టువిడుపులతో ప్రవర్తి స్తుండాలి. బంధుమిత్రుల మధ్య ఆప్యాయతతో కలిసిపోతుండాలి. అయితే ఒకేసారి వదలివేసినప్పటికీ, ఆత్మగౌరవాన్ని కోల్పోవద్దు. పిల్లలు సమాజంతో కలగలసిపోతుండటాన్ని నేర్పించాలి.

● సాయం అవసరమైనవారికి తగిన సాయం చేయడాన్ని అల వాటు చేయాలి. ఇటువంటి దయార్ద్రహృదయాలతో పెరుగుతుండే పిల్లలు సమాజంలో గౌరవించబడుతుంటారు.

● ప్రపంచంలో ఏమూలకైనా ఎవరైనా వెళ్ళగలిగే కాలం ఇది. ఆహారం, దుస్తులు, అలవాట్లు, పూజ పద్ధతులు, సంభాషణ అంటూ అన్నింటిలో ఒక్కొక్క వ్యక్తి విభిన్నంగా ఉంటుంటారు. సదరు వ్యత్యా సాలను గౌరవించడం, వాటిని దాటుకుని ఎదుటివారిని సమ దృక్కోణంతో చూడటాన్ని పిల్లలకు అలవాటు చేయాలి.

● ఒక సమస్య ఎదురైనప్పుడు, మన చిన్నారి తప్పు చేసినప్ప టికీ ఆదరించడం వలన ఆ చిన్నారికి నీతినియమాలను గురించి తెలియకుండా పోతుంటుంది. 'నువ్వు తప్పు చేశావు' అంటూ పిల్లలకు చెప్పి, నైతిక విలువలను వారికి అవగతం చేయాలి. తద్వారా వారు న్యాయంవైపు నిలబడటాన్ని అలవాటు చేసుకుంటారు.

● ఎవరిమీదైనా కోపం కలుగవచ్చు. ఎవరితోనైనా అభిప్రాయ భేదాలు ఏర్పడవచ్చు. చిన్న చిన్న తగాదాలు జరుగవచ్చు. అవన్నీ తాత్కాలికమైనవే. కాబట్టి ఎట్టి పరిస్థితులలో ఏ ఒక్కరినీ గాయపరుచ కూడదనే విషయాన్ని పిల్లలకు చెప్పాలి.

● ఆహారం, పుస్తకాలు, ఆటవస్తువులు అంటూ అన్నింటినీ ఇతరులతో పంచుకునే లక్షణాలను అలవాటు చేయండి. తోటివారితో కలగలసిపోతుండే వ్యక్తులుగా వారు పెరుగుతుంటారు.

● ఇతరులకు చెందిన ఏ ఒక్క వస్తువును దక్కించుకోవాలనే పేరాశ తగదనే విషయాన్ని వారికి బాల్యప్రాయంలోనే అవగతం చేయండి. అది పెన్సిలో, చిన్న చిన్న ఆటబొమ్మలో, తమ దగ్గర లేని వాటిని ఎదుటివారి దగ్గర చూసినప్పుడు పిల్లలు ఆతృతపడుతుం టారు. అటువంటిది తనకూ కావాలనే భావన తలెత్తుతుంటుంది. 'సదరు ఆశకు హద్దులే ఉండవు. అది ఈర్ష్య, ఆత్మన్యూనతాభావం వంటి పలు నిరాశావహ భావనలను ఏర్పరుస్తుంటాయి' అనే విష యాన్ని పిల్లలకు చక్కగా వివరించి చెప్పాలి.

● ఎదుటివారు ఏవైనా సాధనలు చేసినప్పుడు, మనసారా వారిని అభినందించే గుణం, పిల్లలకు సహజంగానే అలవడు తుండాలి. ఆ లక్షణం అన్ని విధాలైన నిరాశావహ భావనలను తరిమి కొడుతుంటుంది. ఎదుటివారిని పొగడుతుండే చిన్నారి, ఎదుటివారి నుంచి అమితమైన పొగడ్తలను అందుకోవడం జరుగుతుంటుంది. అదే వారికి మానసిక తృప్తిని అందిస్తుంటుంది. ఆ భావనే సాధనలు చేసేవిధంగా ప్రోత్సహిస్తుంటుంది. ఈ గొలుసుకట్టును పిల్లలకు అర్థమయ్యేవిధంగా వివరించండి.


● ప్రతి విషయానికీ భయపడుతుండే చిన్నారి, ఆత్మవిశ్వాసాన్ని మరియు ఆత్మగౌరవాన్ని కోల్పోవడం జరుగుతుంటుంది. కఠిన మైన పరిస్థితులలో ఆందోళనకు లోనై నిస్తేజంగా ఉండిపోవడం జరుగుతుంటుంది. ఎటువంటి క్లిష్టపరిస్థితులనైనా ఎదుర్కోగల మాన సికస్థైర్యాన్ని వారి మనస్సులలో బలపరచండి. వారు ధైర్యంగా ఏ పనినైనా చేసినప్పుడు అభినందించాలి. వారు సాధకులుగా ఎదిగేం దుకు కుదురుతుంది.


● ఒక చిన్నారి తన గురించి గొప్పగా భావించడం జరుగు తుంటుంది. అయితే, ఇతరులు ఏదో ఒక కారణం చెబుతూ విమర్శించ వచ్చు. సదరు విమర్శలను స్వీకరించే పరిపక్వతను వారి మనస్సులలో కలిగించండి. 'మన అభిప్రాయాలకు విభిన్నమైన అభిప్రాయాలు పలువురికి ఉంటుంటాయి' అనే విషయాన్ని పిల్లలు అవగతం చేసు కోవాలి. అప్పుడే వారు సమాజంలో ఎదురవుతుండే భిన్నత్వాలను అవగతం చేసుకుంటుంటారు.

● బాధ్యతలను స్వీకరించే పరిపక్వతను చిన్నవయస్సులోనే పిల్లలకు అలవాటు చేయాలి. చిన్న చిన్న పనులు చేసే బాధ్యతను వారికి అప్పగించండి. ఆ యా పనులను వారు చక్కగా చేసినప్పుడు, వారిని ప్రశంసించండి. పాఠశాలలో, సమాజ ములో కొన్ని బాధ్యతలను స్వీకరించే విధముగా వారిని పోత్సహించండి.

● కోపం, ఏడుపు, విసుగు వంటి భావోద్వేగాలను వెనువెంటనే వ్యక్తీకరించకుండా ఉండేందుకు అవసర మయ్యే సహనాన్ని పిల్లలు కలిగివుండటం మంచిది. ఎటు వంటి పరిస్థితులలోనైనా భావోద్వేగాలకు బానిసలైపో కుండా వుండేవిధంగా వారిని తీర్చిదిద్దాలి. అప్పుడే ఏ పనిని కూడ అలక్ష్యంగా చేయకుండా, ప్రతి పనిని బాధ్యతా యుతంగా చేస్తుంటారు.

● అలసట చెందకుండా, విసుగుతో ప్రయత్నాన్ని వదిలేయకుండా నిరంతరంగా ఒక పనిని చేయడాన్ని అల వాటు చేయండి. జీవితపర్యంతం నిరంతర ప్రయత్నాలే వారి పురోగతికి ప్రక్కబలంగా ఉంటుంటాయి. ●





# మనం నేర్చుకోవలసిన నైతిక విలువలు!

ఒక చేపపిల్ల పుడుతున్నప్పుడే ఈత నేర్చుకున్నట్లుగా మనం కూడ పుడుతున్నప్పుడే కొన్ని నైతిక విలువలను పొందు తున్నాము. ఇంకా అధికమైన విలువలను కుటుంబం, సమాజం ద్వారా నేర్చుకుంటున్నాము. దాని ప్రకారమే మన యొక్క జీవితాన్ని ఏర్పరుచుకుంటున్నాము.

బహిరంగ ప్రదేశాలను అశుభ్రం చేస్తోన్న మనుషులను చూసి, 'ఇదే మీ ఇల్లు అయితే, ఈవిధంగా చేస్తారా?'అనే ప్రశ్న సంధించ బడుతుంటుంది. ఇల్లు లాగానే బహిరంగ ప్రదేశాలను కూడ శుభ్రంగా ఉంచుకోవాలనే నైతిక విలువ మనలో ఉండటమే దాని వెనుకనున్న ప్రధాన కారణం. అది మన మనస్సులో బలంగా ఉంటుంది.

అలారమ్ శబ్దాన్ని మోగించుకుంటూ వేగాతివేగంగా దూసు కొస్తున్న అంబులెన్స్‌కు ట్రాఫిక్ జామ్‌లో ఒక ప్రక్కకు తొలగి దారిని ఇవ్వకుండా, కొంతమంది వాహనాలను నడుపుతుంటారు. అటువంటి వ్యక్తులను చూస్తున్నప్పుడు, 'ఇదే సమయంలో వారి బంధువులు ఎవరైనా సదరు అంబులెన్స్‌లో ఉన్నట్లయితే, వారు ఆ విధంగా చేస్తారా?'అనే ప్రశ్న తలెత్తుతుంటుంది. అంబులెన్స్ శబ్దాన్ని వినగానే, ఒకప్రక్కకు తొలగి, దానికి తగిన దారిని ఇస్తూ, అందులోనున్న బాధితుడు ఆరోగ్యవంతంగా కోలుకోవాలని ప్రార్థన చేస్తుండే నైతిక విలువ మనలో ఉన్నది.

రద్దీగానున్న ఒక బస్సులోకి ఒక గర్భిణీస్త్రీ ఎక్కి, కూర్చునేందుకు చోటులేక అవస్థలు పడుతున్నప్పుడు, ఆ చుట్టుప్రక్కల కూర్చుని వున్న పలువురు, ఆమె కష్టం తమకు తెలియనట్లుగా కళ్ళు మూసు కుని నిద్రపోతున్నట్లుగా నటిస్తుంటారు. ఆ దృశ్యాన్ని చూస్తోన్న పలువురి మనస్సులలో, 'వాళ్ళ కుటుంబ మహిళ అయినట్లయితే, ఈవిధంగా ప్రవర్తిస్తారా?'అనే ప్రశ్న తలెత్తుతుంటుంది. గర్భిణీ స్త్రీలో, దివ్యాంగులో అవస్థలు పడుతున్నప్పుడు, వారికి వెనువెంటనే తగిన సాయాలు చేయడమనేది మన సమాజం మనకు నేర్పించిన నైతిక విలువ. దానిని మనం పాటిస్తుంటాము.

ఈవిధంగా పలు సంభవాలను, పలు ఉదాహరణలను చెప్ప వచ్చు. నైతిక విలువలు లేని ఒక సమాజం ప్రమాదకరమైనది. అందరూ స్వార్థచింతనతో, తాము కోరుకున్నవి అందుకోవాలనే ఉద్దేశ్యంతో దేనినైనా చేసేవారుగా ఉన్నట్లయితే, అక్కడ మానవత్వం అనేది కనిపించదు. చట్టాల ద్వారా, సామాజిక నిబంధనల ద్వారా ధర్మబద్ధమైన జీవితాలను రూఢీ చేస్తుండే ప్రదేశాలే ప్రశాంతమైన ప్రదేశాలుగా విలసిల్లుతుంటాయి. అటువంటి ఒక ప్రశాంతవనమైన భారతదేశంలో మన జీవిస్తున్నామనేది గర్వించదగిన విషయం.

ఒక్కొక్క దేశంలో కొన్ని నియమాలు, చట్టాలు మారుతుంటాయి. కొన్ని దేశాలలో చట్టబద్ధంగా అంగీకరించబడిన కొన్ని విషయాలు,

ఇంకొక దేశంలో చట్టవిరుద్ధమైనవిగా భావించబడుతూ వుండవచ్చు. అయినప్పటికీ అన్ని దేశాలలో మనుషులు పాటించవలసిన నీతినియమాలు కొన్ని ఉంటుంటాయి. వాటిని అవగతం చేసుకోవాలి.

- ముందస్తు తీర్మానాలలో, ఇష్టాయిష్టాలో లేకుండా ఓపెన్‌హార్ట్‌తో దేనినైనా, ఎవరినైనా ఎదుర్కోవాలి. అప్పుడే మనుషులను, వారు చెబుతుండే విషయాలను అర్థం చేసుకునేందుకు కుదురుతుంటుంది. దేనిని తప్పుగా అర్థం చేసుకోవడం జరుగదు. ఇతరులకు ప్రేమాభిమానాలను పంచేందుకు కుదురుతుంది. వారి నుంచి కొన్ని విషయాలను నేర్చుకోవచ్చు.
- మనం తప్పు చేసినప్పుడు ఒప్పుకునే నిజాయితీ వుండాలి. అప్పుడే ఆ తదనంతరం చక్కగా చేస్తూ జయించేందుకు కుదురుతుంటుంది. అదేవిధంగా డబ్బులు, అంతస్తు, నేపథ్యం అంటూ ఏ విషయంలోనైనా ఏ ఒక్కరినీ విభిన్నంగా చూడకుండా, అందరినీ సమదృష్టితో చూడగలిగిన ఋజువర్తన ఉండాలి.
- కుటుంబసభ్యులకు, స్నేహితులకు, బంధువులకు, పనులను చేస్తుండే కార్యాలయ ఉద్యోగులకు, మంచి అవకాశాలను అందిస్తోన్న దేశానికి విశ్వాసంతో, నిజాయితీగా ఉండాలి. ఈవిధమైన విశ్వాసమే మనుషులను సద్భావనతో ఉండేవిధంగా చేస్తుంటుంది. దేనినైనా చక్కగా చేసే శ్రద్ధాభక్తులు మనస్సులో మొలకెత్తుతుంటాయి.
- తోటి మనుషులను, వారి యొక్క నమ్మకాలను గౌరవించాలి. బహిరంగ ప్రదేశాలను కూడ మన ఆస్తిపాస్తులను కాపాడుతోన్నవిధంగా జాగ్రత్తగా చూసుకోవాలనే భావన మనస్సులో తలెత్తుతుండాలి. ఏ ఒక్కరినీ గాయపరుచకూడదు. మన స్థితిలో ఉన్నట్లుగానున్న ఏ ఒక్కరికీ ఇబ్బందులను కలిగించకూడదు.
- ఏ పనిని చేసినప్పటికీ, అందులో సంపూర్ణకృషిని చేస్తూ, ఆయా పనులను అత్యుత్తమముగా చేయాలి. 'ఇతను ఈ పనిని సూచించిన సమయంలో అత్యుత్తమంగా, బాధ్యతాయుతంగా చేసి ముగిస్తాడు'అనే నమ్మకాన్ని కలిగించాలి. ఎటువంటి క్లిష్ట పరిస్థితులలోనైనా, నిరంతర ప్రయత్నముతో అవిరళ కృషిని చేయాలి.
- ఎటువంటి పరిస్థితులలోనైనా విధులను పాటించే బాధ్యత ఉండాలి. వాహనాలే ఏమంతగా రాని అర్ధరాత్రి సమయంలో ఎరుపు సిగ్నల్‌ను పట్టించుకుని, వాహనాన్ని నిలిపి, పచ్చ సిగ్నల్ వెలిగిన తదనంతరమే ముందుకెళ్ళడమనేదే బాధ్యత!
- ఎదుటివారి భావనలను అవగతం చేసుకుని, వారికి తగిన సాయాన్ని చేస్తుండే మనస్సు ఉండాలి. తప్పులు చేసి వేదనపడుతోన్న ఎవరినైనాసరే, మన్నించగల గొప్ప మనస్సును కలిగివుండాలి. తనకు సాయం చేసిన ఎవరినైనాసరే, కృతజ్ఞతాభావంతో గుర్తుచేసుకుంటుండే మంచి హృదయం ఉండాలి. కాల్‌సెంటర్ ఉద్యోగులు మాట్లాడుతున్నట్లుగా అణకువతో మాట్లాడుతుండటడాన్ని అలవాటు చేసుకోవాలి.
- ఎంతటి ఉన్నతస్థాయిలో ఉన్నప్పటికీ, ఏ ఒక్కరినీ ఎదిరించి మాట్లాడుతుండే లక్షణాన్ని కలిగివుండకూడదు. అణకువతో మాట్లాడుతుండాలి. ఎదుటివారికి సాయం చేసే విషయంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగల మానసికధైర్యాన్ని కలిగి వుండాలి. సహనంతో ఉండగలిగిన గుణగణాలను అలవాటు చేసుకోవాలి.
- మనలను, మనం ఉంటుండే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మనం ఉంటోన్న ప్రదేశంలో పరిశుభ్రత, అపరిశుభ్రంగా మారిపోయేవిధంగా చేయకూడదు.
- సమిష్టిగా కలసిపోయి కృషి చేయడం అలవాటుగా చేసుకున్నవాళ్ళం మనం. ఎటువంటి పరిస్థితులలోనైనా ఎవరితోనైనా కలగలసిపోతూ కృషి చేయడాన్ని అలవరుచుకోవాలి. ఆవిధమైన ప్రవర్తన మనలను ఉన్నతశిఖరాలకు చేరవేస్తుంటుంది. ●


# తేటతెలుపు

| భావనలు |

**THEATA TELUPU**

తెలుగు మాసపత్రిక

సంపుటి - 8 సంచిక - 11

ఫిబ్రవరి, 2026

విలువైన ప్రచురణ - లోకజ్ఞానసూచిక

గౌరవ సంపాదకులు

**కె.ఆర్. నాగరాజన్**

సంపాదకుడు

**టి.జె. జ్ఞానవేల్**

కార్యనిర్వాహక సంపాదకుడు

**ఐ. అరుణ్**

పుస్తక అలంకరణ - సమాచార సేకరణ

తరు మీడియా (ప్రై) లిమిటెడ్.,

నెం: 188, క్రింది అంతస్తు,

14 వ క్రాస్ వీధి జంక్షన్, డిఫెన్స్ కాలనీ,

ఈక్కాడుత్తాంగల్, చెన్నై - 600 032.

చరవాణి : 99529 20801

email : contacttharu@gmail.com



ఈ పుస్తకంలోని ఏ ఒక్క భాగమూ ముద్రాపకుని వ్రాత పూర్వకమైన ముందస్తు అనుమతి పొందకుండా మలి ముద్రణ చేయడమో, అచ్చు మరియు అంతర్జాల ముద్రణా విధానాలలో మలి ముద్రణ చేయడమో, కాపీరైట్ చట్టరీత్యా నిషేధించబడినది.



Published by

**K.R. NAGARAJAN**

Published from

10, Sengunthapuram, Mangalam Road

TIRUPUR-641604, TAMILNADU

Phone No : 0421- 4304106

Cell No : 98422 74137

ఒక కళాశాలలో ప్రసిద్ధి చెందిన ఒక ప్రొఫెసర్ ఉన్నాడు. తత్త్వశాస్త్రం, చరిత్ర, రాజకీయాలు అంటూ పలువిధాలైన గ్రంథాలను రచించాడు. అందరూ ఆయనను గొప్ప మేధావి అని పొగడుతుంటారు. తను గొప్ప మేధావిననే గర్వాతిశయంతో ఆయన పాఠాలను చెబుతున్నప్పుడు, విద్యార్థినీవిద్యార్థులను అవమానపరుస్తుంటాడు. విద్యార్థినీవిద్యార్థులను ఏమాత్రం సంబంధంలేని ప్రశ్నలను అడుగుతుంటాడు. సరైన సమాధానాలను చెప్పలేక వారు అవస్థలు పడుతున్నప్పుడు, ''నీకు ఏమాత్రం తెలివితేటలు లేవా? నీకు ఏమాత్రం బుద్ధి లేదా? నేను ఎంత గొప్ప మేధావినో తెలుసా? మీవంటి మూర్ఖులకు పాఠాలను చెప్పాల్సిన దుస్థితి నాకు దాపురించింది''అంటూ తనను తానే విమర్శించుకుంటుంటాడు.

ఒకరోజు ఆయన ఈవిధంగా తనను తానే పొగడుకుంటున్నప్పుడు, ఒక విద్యార్థిని లేచి నిలబడి, ''ఒకరు జ్ఞానసంపదను ఏ విధంగా పొందుతారు సార్?''అని అడిగింది. అకస్మాత్తుగా సంధించబడిన ఆ ప్రశ్నకు ఏమి జవాబు చెప్పాలనే విషయం తెలియక ఆయన తడబడ్డాడు. ''నేను తత్త్వశాస్త్రం, రాజకీయాలు, చరిత్రకు సంబంధించిన పాఠాలనే అధ్యయనం చేశాను. నాకు జ్ఞానసంపదకు సంబంధించిన ఈప్రశ్నకు తగిన సమాధానం తెలియదు''అంటూ బదులిచ్చాడు.

''ఎప్పుడూ మీరు, మీ జ్ఞానసంపదను గురించి, మా మూర్ఖత్వాన్ని గురించి మాట్లాడుతుంటారు కదా! ఆ జ్ఞానసంపద ఎలాగ లభిస్తుందనే సాధారణమైన ప్రశ్నకు జవాబు తెలియదా సార్?''అంటూ ఆ విద్యార్థినీ మరలా ప్రశ్నించడంతో, తరగతి గదిలోని విద్యార్థినీవిద్యార్థులందరూ బిగ్గరగా నవ్వారు. ఆ ప్రొఫెసర్ మౌనంగా తరగతి గది నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

మరుసటిరోజు తరగతి గదికి వచ్చిన ప్రొఫెసర్, ''నువ్వు అడిగిన ప్రశ్న గురించి నిన్నంతా చదివాను. ఆలోచించాను. ఇప్పుడు జవాబు చెబుతాను. ఒకరు తనకు తాను ఆలోచించుకుని, స్వీయ పరిశోధన చేసుకోవడం ద్వారా జ్ఞానసంపదను పొందుతుంటారు. జ్ఞానసంపదను పొందేందుకు ఇదొక్కటి మాత్రమే ఒకే ఒక మార్గం'' అని చెప్పాడు. మరలా సదరు విద్యార్థిని లేచి నిలబడి, ''మనం స్వీయపరిశోధనతో జ్ఞానసంపదను పొందిగలిగినప్పుడు, మేము ఎందుకు చదవాలి సార్? మీరు చెప్పే పాఠాలను ఎందుకు వినాలి?''అని ప్రశ్నించింది.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయిన ప్రొఫెసర్ స్తబ్దంగా నిలబడిపోవడంతో మరలా తరగతి విద్యార్థినీవిద్యార్థులందరూ బిగ్గరగా నవ్వారు. ''ఫర్వాలేదు సార్! మీరు ఇంటికెళ్లి బాగా చదివి, ఆలోచించిన తరువాత రేపు వచ్చి, జవాబు చెప్పండి''అని చెప్పి, ఆ విద్యార్థిని కూర్చుంది.

మరుసటిరోజు తరగతి గదిలోకి ఆ ప్రొఫెసర్ ఓ కొత్త వ్యక్తిలాగ ప్రవేశించాడు. ''ఇన్నాళ్ళూ నేను మీతో అత్యంత దారుణంగా ప్రవర్తించాను. నన్ను క్షమించండి''అంటూ విద్యార్థినీవిద్యార్థులను అభ్యర్థించిన ప్రొఫెసర్, సదరు విద్యార్థినిని లేచి నిలబడమని చెప్పాడు. ''నువ్వు నాకు చాలా ముఖ్యమైన పాఠాన్ని నేర్పించావు. ఇప్పుడు నాకు అర్థమవుతోంది. స్వీయచింతనతో జ్ఞానసంపదను పొంద



# ఇద్దరు మార్గనిర్దేశకులు!



వచ్చు. ఎదుటివారి నుంచి కూడ జ్ఞానసంపదను పొందవచ్చు. అందుకోసమే విద్యను అభ్యసిస్తున్నాము''అని వివరించి చెప్పాడు.

అందుకు సదరు విద్యార్థిని, ''మీరు చెప్పేది నిజమే. జ్ఞానసంపదను పొందేందుకు ఇంకొక మార్గం ఉంది''అని చెప్పింది. ఆ మాటలను విన్న ప్రొఫెసర్, ''సరే, ఏమిటి ఆ మార్గం? నేను నీ దగ్గర నేర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాను''అని అన్నాడు. ''అనుభవాల ద్వారా పొందవచ్చు సార్. ఇన్నిరోజులపాటు మీ నుంచి అవమానాలను భరించాము కదా? ఆ అనుభవం మాకు జ్ఞానసంపదను అందించింది. ఈ తరగతిలో మీరు సందిగ్ధతతో నిలబడ్డారు కదా! సదరు అనుభవం మీకు జ్ఞానసంపదను అందించింది''అని వివరించింది.

'మనుషులు మూడు విధాలుగా జ్ఞానసంపదను పొందుతున్నారు' అనేది కన్‌ఫ్యూషియస్ ప్రతిపాదన. సమాచారాన్ని మనస్సులో పరిశీలించి చూసి ప్రతిఫలించడమనేది మొదటి విధానం. అది ఋజువర్తనతో కూడినది. ఎదుటివారిని చూస్తూ, అలాగే చేయడమనేది రెండవ విధానం. అది సులభమైనది. అనుభవాలతో పొందడం మూడవ విధానం. అది చేదైనది. వేరు మార్గాలు ఉన్నప్పటికీ, ఇవే ప్రారంభం.

నైతిక విలువలను విద్యార్థినీవిద్యార్థుల నుంచి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు కూడ నేర్చుకోవచ్చుననే దానికి ఈ సంభవం ఒక ఉదాహరణ. విద్యార్థినీవిద్యార్థులకు ఉపాధ్యాయినీఉపాధ్యాయులు నేర్పించుతారనేదానికి ఇంకొక ఉదాహరణ ఉన్నది. ఇది నిజంగానే ఒకరి జీవితంలో సంభవించిన సంఘటన.

పాఠశాలలో పరీక్షల సమయం. ఒక్కొక్క తరగతిలో విద్యార్థినీవిద్యార్థులు నెలసరి పరీక్షలను వ్రాస్తున్నారు. ఒక తరగతిలో పరీక్షను వ్రాస్తోన్న ఒక విద్యార్థి, మేజాబల్ల క్రింద పుస్తకాన్ని పెట్టుకుని కాపీ కొడుతూ వ్రాస్తున్నాడు. అది తరగతి ఉపాధ్యాయుడు గమనించలేదు.

ఒక్కొక్క తరగతి గదికి మెల్లగా వస్తూ, పరీక్షలు వ్రాస్తోన్న విద్యార్థినీవిద్యార్థులను గమనిస్తోన్న ప్రధానోపాధ్యాయుడు, ఆ విద్యార్థిని ప్రత్యక్షముగా చూసి, పట్టుకున్నాడు. వెంటనే ఆ విద్యార్థికి దండన ప్రకటించాడు. తరగతి గదిలో అందరు విద్యార్థినీవిద్యార్థులముందు ఒక పెద్ద బెత్తంతో ఆరుసార్లు కొట్టడమే ఆ పాఠశాలలో విధించబడుతుండే దండన. ఆ దండన తప్పకుండా విధించబడుతుంటుంది.

చేతిలో పెద్ద బెత్తం పట్టుకుని విద్యార్థి దగ్గరకు చేరుకున్నాడు సదరు ప్రధానోపాధ్యాయుడు. అయితే, సదరు విద్యార్థిని దండించడాన్ని తరగతి ఉపాధ్యాయుడు అడ్డుకున్నాడు. ''వాడు కాపీ కొట్టడానికి కారణకర్తను నేనే. నేను, తనకు సరిగ్గా బోధించినట్లయితే, వాడు చక్కగా చదువుకుని పరీక్షలను వ్రాసేవాడు. కాబట్టి నన్ను దండించండి''అని అన్నాడు తరగతి ఉపాధ్యాయుడు.

తరగతి గదిలోనున్న విద్యార్థినీవిద్యార్థులందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు. ప్రధానోపాధ్యాయుడు దీనిని ఎదురుచూడలేదు. అయితే ఆయన దండనను అమలుపరుచక తప్పదు. దండించకపోతే పాఠశాల క్రమశిక్షణ దెబ్బతింటుంది. నిజాయితీపరుడైన సదరు ఉపాధ్యాయుడిని దండించడమా అని వేదన చెందినప్పటికీ, నీతిని అమలుపరిచే నిర్ణయంలో తరగతి ఉపాధ్యాయునివైపు తిరిగాడు.

''ఆ విద్యార్థి చేసిన తప్పుకు తరగతి ఉపాధ్యాయుడు దండించబడుతున్నాడు''అని చెప్పాడు. వెంటనే తరగతి ఉపాధ్యాయుడు ఆయన మాటలను అడ్డుకున్నాడు. ''లేదు...వాడు చేసిన తప్పుకోసం కాదు, నేను చేసిన తప్పు కోసం నన్ను దండించండి. నా పనిని నేను చక్కగా చేసినట్లయితే, ఈ బాలుడు కాపీకొట్టివుండేవాడే కాదు. కాబట్టి, తప్పు చేసినది నేనే''అని చెప్పి, బెత్తం దెబ్బలను తినేందుకు చేతులను చాపి, ప్రధానోపాధ్యాయుని ముందుకు వెళ్ళాడు.

ప్రధానోపాధ్యాయుడు బెత్తాన్ని ఎత్తగానే, కాపీ కొట్టిన విద్యార్థి పరుగులు పెట్టుకుంటూ వచ్చి ఆయన పాదాలపైపడి నమస్కరిస్తూ, ''సార్, దయచేసి మా క్లాసుమేస్టారుగారిని దండించవద్దు. తప్పు చేసింది నేనే. నన్ను దండించండి''అంటూ ఏడ్చాడు. తమ తరగతి ఉపాధ్యాయునికి చేతులెత్తి నమస్కరిస్తూ, ''సార్, నేను ఇకమీదట చక్కగా చదువుతాను. పరీక్షలో ఫెయిల్ అయినప్పటికీ, ఫర్వాలేదు. ఎట్టి పరిస్థితులలో ఇకపై కాపీ కొట్టను''అంటూ చెప్పాడు. ప్రధానోపాధ్యాయుడు తన చేతుల్లోని బెత్తాన్ని విరగ్గొట్టి దూరంగా విసిరేసాడు.

'ఏది తప్పు'అనే విషయానికి సంబంధించి, ఒక కొత్త వివరణను ఆరోజు, సదరు పాఠశాల స్వీకరించింది. ఎటువంటి దండనను పొందకుండానే, విద్యార్థినీవిద్యార్థులు ఒక కొత్త పాఠాన్ని నేర్చుకున్నారు. ఆరోజు నుంచి చక్కగా చదువసాగారు.

## మీరు నైతిక విలువలను పాటిస్తున్నారా?

ఈ విషయాలు మీలో ఉన్నట్లయితే, మీరు నైతిక విలువలను, ఉన్నతమైన గౌరవమర్యాదలను కలిగివున్నారని అర్థం.

- మీ అభిప్రాయాలను వ్యతిరేకిస్తూ వాగ్వివాదాలు చేస్తుండే మనుషుల ముందు గొంతు పెంచుతూ మాట్లాడవద్దు. సదరు వ్యక్తులు వ్యతిరేక భావనలను వ్యక్తీకరించినప్పటికీ, వారితో అమర్యాదగా ప్రవర్తించవద్దు.
- ఎక్కడికైనా సరే, చెప్పిన సమయానికి వెళ్ళండి. మీకు కేటాయించిన సమయానికంటే అధిక సమయాన్ని ఖర్చు చేయవద్దు. గౌరవించబడుతుంటారు.
- ఆకృతిని చూస్తూ, మాటలను వింటూ ఏ ఒక్కరినీ అంచనా వేయవద్దు. ఎదుటివారి గుణగణాలను అంచనా వేయడమనేది మన పని కాదు.
- ఎదుటివారిని ఉత్సాహపరిచినట్లయితే, మన పనులకు సంబంధించి ఎక్కడెక్కడినుంచో ప్రోత్సాహం లభిస్తుంటుంది. ఇతరులను పొగిడినట్లయితే, మనకూ ప్రశంసలు లభిస్తుంటాయి.
- ఏ ఒక్కరిని గురించి నిందారోపణ చేయవద్దు. మిమ్మల్ని అభిమానించే వ్యక్తులను ఎట్టి పరిస్థితులలో వదులుకోవద్దు.
- మీరు చూస్తోన్న అన్ని విషయాలను గురించి అభిప్రాయాలను వ్యక్తీకరించాల్సిన అవసరం లేదు. కొన్ని కొన్ని సమయాలలో మౌనంగా ఉండటమే బుద్ధికుశలత.
- 'ఇది నీవల్ల కాదు'అంటూ ఎవరైనా చెప్పినట్లయితే నమ్మవద్దు. వారి యొక్క ప్రతిభాపాటవాలను అనుసరించే, ఆ యా పనులను వారు అంచనా వేస్తుంటారు. మీ యొక్క ప్రతిభ గురించి మీకు తెలుసు.





## నమ్మకాన్ని అందించే నైతిక విలువలు!

- మీరు అభిమానించే వ్యక్తులకు తగిన సాయం చేసేందుకు ఎంతటి శ్రమనైనా చేసేందుకు సిద్ధపడండి.
- ఎవరికైనా వాగ్దానం చేసినట్లయితే, ఖచ్చితంగా ఇచ్చిన మాటను నెరవేర్చండి.
- నిరంతర ప్రయత్నం విజయాన్ని అందిస్తుంటుంది. మీరు నమ్ముతోన్న దేనినైనా ధైర్యంగా ముగించండి.
- పట్టువిడుపులతో ప్రవర్తించండి. పలు మంచి విషయాలు మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తాయి.
- జీవితంలో అసాధారణమైన సాధనలు సుసాధ్యమే అనే విషయాన్ని మనఃస్ఫూర్తిగా విశ్వసించండి.
- అన్ని కలలు నిజమవుతాయి. వాటిని సాకారం చేసుకునేందుకు తగిన కృషి చేయడమే మీ యొక్క పని.
- ఎట్టి పరిస్థితులలో సహనాన్ని కోల్పోవద్దు. మంచి విషయాల కోసం తప్పక వేచియుండాలి.

## అది నావల్ల కాదు!

చెక్కపనులను చేసేందుకు కుగ్రామానికి చేరుకున్న ఒక వండ్రంగి, మతిమరుపుతో తను సుత్తిని తీసుకునిరాలేదనే విషయాన్ని చాలా ఆలస్యంగా గ్రహించాడు. వెంటనే ఆ గ్రామంలో నున్న కమ్మరి (ఇనుము పనులను చేసే వ్యక్తి) దగ్గరకు వెళ్ళి, తన సమస్యను వివరించి, సాయాన్ని అడిగాడు. తను తన దగ్గరున్న సుత్తిని అందించాడు. చూడటానికి ఆకర్షణీయంగా కనిపించిన ఆ సుత్తిని, ఉపయోగించడాన్ని మొదలుపెట్టిన కొన్ని నిముషాలలో దాని యొక్క ప్రత్యేకతను ఆ వండ్రంగి గ్రహించాడు. ప్రసిద్ధి చెందిన కర్మాగారాలు విక్రయిస్తోన్న సుత్తులకంటే, అది ఎంతో నాణ్యతతో కనిపించింది.

# నిరంతర కృషిని నమ్ముతున్నాను!



తన దేశ ప్రజలు నిరంతర కృషిని నమ్ముతున్నారా? లేక అడ్డదారులలో అదృష్టాన్ని వెదుక్కుంటూ పురోగమించాలని కోరుకుంటున్నారా? అనే విషయాలను తెలుసుకోవాలని ఒక రాజు ఆశించాడు. అందుకోసం ఒక గ్రామాన్ని ఎంపిక చేసాడు. ‘ఈ గ్రామంలోని ప్రజలందరికీ, రాజభవనంలో మహారాజుగారు విందును ఏర్పాటు చేస్తున్నారు’’అంటూ దండోరా వేయబడింది.

విందుకు వెళితే, మహారాజు ఖరీదైన బహుమతులను అందిస్తాడనే పేరాశతో ప్రజలు గుంపులుగుంపులుగా రాజ భవనానికి చేరుకున్నారు. అందరూ రాజభవనానికి చేరుకున్న సమయంలో ఆ రాజు మారువేషంలో ఆ గ్రామానికి చేరుకున్నాడు. ఊరంతా ఖాళీగా కనిపించగా, ఒకే ఒక మహిళ మాత్రం విడిగా పొలం పనులను చేయడం కనిపించింది.

ఆ దృశ్యాన్ని చూసి, ఆశ్చర్యంలో మునిగిపోయిన రాజు, ఆ మహిళతో, ‘‘మీకు విషయమే తెలియదా?’’అన్నాడు. ‘‘రాజుగారు రాజభవనంలో విందు భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ భోజనం చేసిన తరువాత, రాజుగారు ఏదైనా బహుమతిని అందిస్తాడనే ఆశతో అందరూ వెళ్ళారు. ఆ విధంగా అదృష్టవశాత్తు తమకు బహుమతి దొరుకుతుందని అందరూ నమ్ముతున్నారు’’అని బదులిచ్చింది. ‘‘మరి, నువ్వెందుకు వెళ్లలేదు?’’అని రాజు ప్రశ్నించగా, ‘‘నాకు అదృష్టం పట్ల ఏమాత్రం నమ్మకం లేదు. కృషి చేస్తేనే కూలి దొరుకుతుంది. ఈరోజు లభించే కూలి ద్వారానే మా కుటుంబం యొక్క ఆకలి తీరుతుంది. ఆ కూలిని మేము కోల్పోయినట్లయితే, మా కుటుంబం ఆకలిని తీర్చేందుకు కుదరదు. అందుకే నేను వెళ్లలేదు’’ అని వివరించింది.

ఆమె జవాబును విన్న మహారాజు ఆనందభరితుడైపోయాడు. ‘‘వనితామణీ! అందరూ అదృష్టాన్ని వెదుక్కుంటూ రాజుగారు అందిస్తోన్న విందుకు వెళ్ళారని చెప్పావు. ఆ రాజుగారే నిన్ను వెదుక్కుంటూ వచ్చి, బహుమతిని అందించాడని అందరికీ విడమరిచి చెప్పగలవు’’అని చెప్పి, ఆమె చేతుల్లో ఒక బంగారు నాణేల మూటను పెట్టి వెళ్ళిపోయాడు.

నిరంతర కృషే నిజమైన అదృష్టం!

ఆ సుత్తిని తిరిగి ఇస్తున్నప్పుడు, ‘‘ఈ సుత్తిని ఎక్కడ కొన్నారు?’’ అని అడిగాడు. అందుకు సదరు కమ్మరి, ‘‘నేనే మా కొలిమిలో తయారు చేశాను’’అని జవాబిచ్చాడు. కమ్మరి పనితనాన్ని ప్రశంసిస్తూ, తనకు అటువంటి ఒక సుత్తి కావాలని అభ్యర్థించి, ఒక నాలుగైదు సుత్తులను తయారుచేయించి, డబ్బులను చెల్లించి తీసుకున్నాడు.

అతను నగరానికి తీసుకెళ్ళిన ఆ సుత్తులను చూసి ఆశ్చర్యచకితులైపోయిన పలువురు ఆ కుగ్రామంలోని కమ్మరిని వెదుక్కుంటూ వచ్చారు. ఒక కాంట్రాక్టర్ వచ్చి 20 సుత్తులు కావాలని అడిగాడు. ‘‘ఆ వడ్రంగికి ఇచ్చిన సుత్తికంటే బాగా తయారుచేయండి’’అని అన్నాడు. అందుకు సదరు కమ్మరి, ‘‘మీరు ఆవిధంగా చెప్పకూడదు. నేను దేనిని చేసినప్పటికీ, నాణ్యతతోనే చేస్తుంటాను. ఎవరికోసం చేసినప్పటికీ, నాణ్యతలో ఎటువంటి తేడాలు ఉండవు’’అని బదులిచ్చాడు.

అతని ప్రతిభ గురించి త్వరితంగా సర్వత్రా వ్యాపించసాగింది. ఒక పారిశ్రామిక సంస్థ నుంచి అతడిని వెదుక్కుంటూ వచ్చిన వ్యక్తులు, ‘‘ఇతరులు ఇచ్చిన ధరలకంటే, రెండింతలు అధికమైన ధరను ఇస్తాము. మీరు చేసే సుత్తులన్నీ మాకే విక్రయించండి. ఒక సంవత్సరం డబ్బులను మీకు అడ్వాన్స్‌గా ఇస్తాము’’అని చెప్పారు.

వారి ప్రతిపాదనను తిరస్కరించిన సదరు కమ్మరి, ‘‘నాకు ఈ ఆదాయం చాలు. నేను పేరాశపడినట్లయితే, సుత్తి ధర పెరుగుతుంది. మీరు బాగా సంపాయిస్తారు. కానీ, తత్ఫలితంగా సాధారణ వ్యక్తులకు కష్టాలు మొదలవుతాయి. నా ప్రతిభ, నావంటి సాధారణ వ్యక్తులకు ఉపయోగపడితే చాలు’’అని బదులిచ్చాడు.

ప్రతిభాపాటవాలతో, ఋజువర్తనతో ఉంటుండేవారు, అందరి క్షేమాన్ని గురించి ఆలోచిస్తుంటారు.

# నైతిక విలువలను రూపొందించుకోండి!




ఒక్కొక్క విత్తనం నుంచి ఒక్కొక్క బ్రహ్మాండమైన వృక్షముగా పెరిగినట్లుగా, కొన్ని ప్రత్యేకించిన పద్ధతుల నుంచే అన్నివిధాలైన నైతిక విలువలు రూపొందుతున్నాయి. ప్లాటో, అరిస్టాటిల్ వంటి తత్త్వవేత్తలు ఈ విషయాన్నే చెప్పారు. నీతి, నిజాయితీ, ప్రేమానురాగాలు, అందం, మంచితనం అనే ఐదు ప్రధానమైన విషయాలనుంచే అన్ని విధాలైన నైతిక విలువలు రూపొందుతున్నాయి.

**ఒకరు, తనకోసం నైతిక విలువలను రూపొందించుకోవడం ఎలాగ?**

- జీవితంలో మీకు ఏది ప్రధానమైన విషయం? మీరు ఏ యే విషయాలను నమ్ముతున్నారు? మీ యొక్క దీర్ఘకాలపు లక్ష్యాలు ఏమిటి? మిమ్మల్ని ఈ ప్రపంచం ఏవిధంగా అంచనా వేయాలని అనుకుంటున్నారు? ఈవిధంగా మీ యొక్క నమ్మకాలు, లక్ష్యాలే మీ యొక్క పనులను తీర్మానిస్తుంటాయి.
- మీ జీవితంలో మీరు చేస్తోన్న ఉద్యోగం, వ్యాపారం లేక పరిశ్రమలో ఏ యే విషయాలను గౌరవనీయంగా భావిస్తున్నారు? సదరు గౌరవనీయమైన పద్ధతులే, మీ యొక్క పనులలో, లక్ష్యాలలో ప్రతిఫలిస్తుంటాయి. ఏది తప్పు, ఏది ఒప్పు అని విభజించి చూసుకోగల పరిపక్వతను అందిస్తుంటుంది. ఋజువర్తన, కరుణ, మర్యాద, బాధ్యతను వహించడం, అణకువ మొదలైనవి మీ యొక్క గౌరవాన్ని తీర్మానిస్తుంటాయి.
- మీకు రోల్‌మోడల్స్‌గా ఉంటుండే వ్యక్తులను కనిపెట్టండి. మీరు చూసి ఆశ్చర్యపడుతుండే వ్యక్తులు, గౌరవనీయులుగా భావించే వ్యక్తుల జీవితాలను పరిశీలించండి. వారు ఏ యే విషయాలను గొప్పగా భావిస్తున్నారు? ఎటువంటి లక్ష్యాలతో జీవిస్తున్నారు? ఆ యా విషయాలు, వారి యొక్క లక్ష్యాలు, వారి జీవితాలలో ఎటువంటి మార్పులను ఏర్పరిచాయి? వీటన్నింటినీ గమనిస్తూ తగిన పాఠాలను నేర్చుకోండి. ఆ యా పాఠాలు మీకు, మీ యొక్క జీవనగమనంలో మార్గనిర్దేశం చేస్తుంటాయి.
- మీకంటూ కొన్ని లక్ష్యాలను నిర్ణయించుకోండి. ఆ యా లక్ష్యాలను సాధించేవిధంగా జీవించడాన్ని అలవాటు చేసుకోండి. మీ పనులలో ఆ విషయాలను ప్రతిఫలించండి. మీ యొక్క అభివృద్ధి, సదరు లక్ష్యాల దిశవైపే ఉంటుండాలి.
- ఇతరుల ముందు నిజాయితీతో ఉండేందుకు ముందు, మనకు మనమే నిజాయితీగా ఉండాలి. మనకు మనమే చెప్పుకునే విషయాలలో ఏ ఒక్కటీ కూడ అబద్ధమైనదిగా ఉండకూడదు.
- మన ఆలోచనలకు, కార్యనిర్వహణకు మధ్య ఎటువంటి తేడాలు ఉండకూడదు. మన మాటలకు, పనులకు మధ్య వ్యత్యాసం ఉండకూడదు. అన్ని విషయాలలో మన యొక్క ఋజువర్తన వ్యక్తీకరించబడుతుండాలి.
- మన మాటలతో, చేతలతో ఏ ఒక్కరినీ గాయపరుచకూడదు. ఎవరైనప్పటికీ, వారిని గౌరవప్రదంగా చూడాలి.
- 'ఇతనితో మాట్లాడితే, లేనిపోని సమస్యలను తలకెక్కించుకున్నట్లే అవుతుంది' అంటూ ఏ ఒక్కరూ భావించని విధంగా మన మాటలు ఉంటుండాలి. సంభాషణలలో పరుషపదజాలాన్ని ఉపయోగించకూడదు. అప్పుడే మన మాటలకు తగిన గౌరవం లభిస్తుంటుంది.
- జీవితంలో ఒక్కొక్క దశలో నైతిక విలువలు వ్యక్తీకృతమవుతుండాలి. జ్ఞానసంపద యొక్క వెలుగు మిమ్మల్ని ముందుకు నడిపించాలి. తద్వారా జీవితంలో మీరు పొందుతుండేది పురోగతి, విజయాలు మాత్రమే!



Owned, Published by K.R. NAGARAJAN, Published from 10, Sengunthapuram Mangalam Road, TIRUPUR - 641 604 & Printed by B. ASHOK KUMAR at RATHNA OFFSET PRINTERS, 40, Peters Road, Royapettah, Chennai - 600 014. Editor : T.J. GNANAVEL


Inners for Winners
RAMRAJ
VESTS
BRIEFS • TRUNKS
Uplift
your spirit from
Within
Shreyas Iyer - Cricketer
SUKRA
SUPER FINE COTTON VESTS
ROMEX
SUPERIOR BANIANS
RISE-UP
PREMIUM BANIANS
ACOSTE
LUXURY INNERWEARS
Breeze
Eye Let Vests
WinStripe
STRIPED BANIANS
ARCHERY
GYM VEST
COMPACT
PREMIUM COTTON RIB VESTS
LITTLE STARS
KIDS INNERWEARS
Available at Ramraj Showrooms and All Leading Textile Shops | Shop Online at www.ramrajcotton.in

Registered with the Registrar of Newspapers for India under No.TNTEL/2017/74075. Day of Publishing : 1st of every month.

